



ఇక.. ఎన్టీఆర్ జలసిరి

- పథకాన్ని పునరుద్ధరించిన ప్రభుత్వం
- బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల కేటాయింపు
- రైతుల ఆశలు ఫలించినట్లే.. బోర్ల నిర్మాణానికి చర్యలు
- ఐదేళ్లుగా వైసీపీ హయాంలో అటకెక్కిన బోర్ల నిర్మాణం

"ఎన్టీఆర్ జలసిరి.. భూగర్భ జలాలతో పంటలు పండించుకునే వారికి వరం. రైతులకు బోరు బావులతో సాగునీటి భరోసా కల్పించేలా.. చిన్న, సన్న కారు రైతుల వ్యవసాయ భూమిని సేద్యానికి అనుకూలంగా మార్చేందుకు భూగర్భ జలాలను సమర్ధవంతంగా సద్వినియోగం చేసుకునేలా బోర్ల నిర్మాణ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పట్లో ఈ పథకంలో రైతు లకు ఉచితంగా బోర్లు వేయించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకం పేరును వైఎస్ఆర్ జలసిరిగా మార్చింది. అయితే అమలులో చిత్తశుద్ధి లోపించింది. ఈ పరిస్థితుల్లో రైతులు ఐదేళ్లుగా బోర్ల నిర్మాణం కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. దరఖాస్తుల స్వీకరణతోనే వైసీపీ పాలకులు సరిపెట్టారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని పునరుద్ధరించింది. సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ పథకానికి ప్రత్యే కంగా నిధులు కూడా కేటాయించింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని సామాన్య రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఐదేళ్లుగా నిలిచిపోయిన వ్యవసాయ బోర్లను తిరిగి నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుం డటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు."



వ్యవసాయ బోరు

క్లస్టర్ల వారీగా బోర్ల నిర్మాణం...

క్లస్టర్	దరఖాస్తుల సంఖ్య	ఆమోదించినవి	నిర్మించినవి
నరసరావుపేట	823	715	104
సత్తెనపల్లి	1,894	1,532	134
మాచర్ల	5,061	4,170	741
వినుకొండ	2,563	1,954	200
గుంటూరు	197	157	11
తెనాలి	279	229	122
బాపట్ల	314	236	75
చీరాల	4210	3492	821



విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన బోరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అటకెక్కిన బోర్ల నిర్మాణ పథకానికి కూటమి ప్రభుత్వం ఊతం ఇచ్చింది. ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని పునరుద్ధరించింది. త్వరలోనే ఎన్టీఆర్ జలసిరి బోర్ల నిర్మాణం పట్టాలెక్కనుంది. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని ప్రవేశపెట్టి రైతులకు వ్యవసాయ బోర్లు నిర్మించారు. సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేశారు. తిరిగి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే జలసిరికి నిధులు మంజూరు చేసింది. చిన్న సన్న కారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయం బోరు బావులను ఉచితంగా నిర్మించేందుకు నాడు టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరికి శ్రీకారం చుట్టి వేలాది బోర్లను నిర్మించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకం పేరు మార్చడంలో చూపిన శ్రద్ధ బోర్ల నిర్మాణంపై లేకుండా పోయింది. వైఎస్ఆర్ జలకళను ఆర్భాటంగా ప్రవేశపెట్టిన పాలకులు అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపలేదు. దీంతో

(మిగతా 6వ పేజీలో..)



గతంలో టీడీపీ ప్రభుత్వ నిర్మించిన వ్యవసాయ బోరు.. సోలార్ పంపు సెటు

అనుసంధానం

- ప్రతి ఇంటికీ ఇక జియో ట్యాగింగ్
- సచివాలయ సిబ్బందితో హౌస్‌హోల్డ్ జియో మ్యాపింగ్
- విపత్తుల సమయంలో కీలకం కానున్న ట్యాగింగ్
- ఆధార్, ఫోన్ నెంబర్లతో ప్రమాదంలో ఉన్నవారిని గుర్తించే వీలు
- తద్వారా వారికి సహాయం అందించేలా చర్యలు
- బ్యాంకు ఖాతాల ఆధార్ లింకేజీపైనా ప్రత్యేక డ్రైవ్

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనుకోని విపత్తు వచ్చింది. ఎవరు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. వారిని వెదకడం కష్టంగా మారింది. అలాంటి సమయంలో వారిని ఎలా గుర్తించాలి? ఎలా సహాయం అందించాలి? ఎలా కాపాడాలి? ఎలాంటి కమ్యూనికేషన్ లేని విపత్కర సమయాల్లో బాధితులను గుర్తించి కాపాడడం ఎలా? ఇటీవల విజయవాడ వరద విపత్తు సమయంలో ప్రభుత్వానికి ఎదురైన సమస్య ఇది. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. ఎవరెవరు ఎక్కడ నివసిస్తున్నారు.. వారిని సమన్వయం చేసే ఏకైక వ్యవస్థ ఏంటి అనేదానిపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఒక వ్యక్తి పేరు, అతడి ఆధార్ నెంబరు, మొబైల్ నెంబరు లేదా ఇంటి నెంబరు.. ఇలా ఏదో ఒక నెంబరుతో వారి వివరాలు, వుండే ప్రాంతాన్ని కచ్చితంగా గుర్తించి వారికి సహాయం అందించేందుకు మార్గాన్ని కనుగొంది. అదే 'హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్!' ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చేస్తే ఏదో ఒక చిన్న ఆధారంతో ప్రమాదంలో చిక్కుకుపోయిన వారిని గుర్తించి తక్షణ సహాయం అందించ వచ్చని భావించింది. వరదలో కొట్టుకుపోయేవారికి గడ్డిపోచ కూడా ఆసరాగా మారినట్లు ఈ జియో ట్యాగింగ్ విధానంలో ఒక చిన్న వివరం వారి కుటుంబ సభ్యులందరినీ రక్షించే అవకాశం కల్పించబోతోంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒక సారి జియో ట్యాగింగ్ అయితే తుఫానులు, వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ఏదో ఒక చిన్న ఆధారంతో బాధితుల వివరాలు తెలుసుకుని వారికి సహాయం అందించవచ్చు. ఒక ఇంటికి సంబంధించి ఏ చిన్న వివరం తెలిసినా ఆన్‌లైన్లో వాటిని నమోదు చేస్తే మొత్తం వివరాలతోపాటు ఆ ఇంటి లొకేషన్ కూడా కళ్ల ముందు కనిపించేలా ఈ హౌస్‌హెల్డ్ జియో ట్యాగింగ్‌ను రూపొందిస్తోంది.

ప్రతి ఇంటికీ జియో ట్యాగింగ్..

కూటమి ప్రభుత్వం హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి ఇంటినీ ప్రభుత్వంతో అనుసంధానిస్తోంది. గతంలో సంక్షేమ పథకాల ఆధారంగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ఉండేది. ఉదాహరణకు పింఛన్లకు సంబంధించి ఒక మ్యాపింగ్, రేషన్ కార్డులకు సంబంధించి మరో మ్యాపింగ్.. అలా ఆయా పథకాలకు సంబంధించిన మ్యాపింగ్ మాత్రమే వుండేది. ఫలితంగా ఆయా పథకాల పంపిణీకి మాత్రమే అవి ఉపయోగ పడేవి. ఈ చిక్కులను తొలగించి మొత్తం వ్యవహారాన్ని ఒక చోటికి తెచ్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతి ఇంటిని ఆ ఇల్లు ఉండే అక్షాంశం, రేఖాంశం ఆధారంగా జియో ట్యాగింగ్ చేస్తోంది. ఈ పద్ధతి ద్వారా ఎవరెక్కడ ఉన్నారనే విషయం సెకన్లలో తెలిసిపోతుంది. ఒక వ్యక్తి, ఆ కుటుంబ సభ్యులు, వారు నివసించే ఇల్లు, ఆ ఇల్లు పూరిల్లా, రేకుల ఇల్లా, పక్కా ఇల్లా.. వంటి వివరాలు, వీధి సమాచారం సహ మొత్తం అధికారుల లాగిన్లో కనిపిస్తాయి. మ్యాపులో వారున్న

(మిగతా 8వ పేజీలో..)

జియో ట్యాగింగ్ ఇలా..

రాష్ట్రంలోని ప్రతి కుటుంబ వివరాలను ప్రభుత్వం జియో ట్యాగింగ్‌లో నమోదు చేస్తోంది. జీఎస్‌డబ్ల్యూఎస్ ఎంప్లాయిస్ మొబైల్ యాప్ అనే యాప్‌లో జియో ట్యాగింగ్ చేస్తారు. ఆ యాప్‌లో ప్రతి ఇంటి ఫొటో, డోర్ నెంబరు, లొకేషన్‌ను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అప్లోడ్ చేస్తారు. ప్రతి కుటుంబం వద్దకు సచివాలయ ఉద్యోగులు వెళ్లి ఆ కుటుంబానికి చెందిన ఇంటిని అప్లోడ్ చేసి వాటిని ధ్రువీకరించేలా కుటుంబ సభ్యుల్లో ఒకరితో ప్రత్యేక డివైజ్ ద్వారా వేలి ముద్రలు, ఫేస్, ఐరిష్ పద్ధతిలో ఆమోదం తీసుకుంటారు.

- రూ.6 కోట్లపైనే ఘరానా దోపిడీ
- కొత్తపల్లి గ్రామ పెద్దే సూత్రధారి

కొండలను మింగేశాడు



గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్



ధ్వంసమైన రహదారి



గ్రావెల్ తవ్వకాలతో రూపురేఖలు మారిపోయిన కొండ

మాచర్లటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామపెద్ద.. గ్రామ సంక్షేమం చూడాలి. అక్ర మాలు జరుగుతుంటే అడ్డుకోవాలి. ఎవరైనా తప్పుచేస్తుంటే సరిదిద్దాలి. కానీ ఆయనే అక్రమా లకు పాల్పడి రూ.6కోట్లకు పైనే గ్రావెల్ కొండల ను పిండిచేసి సొమ్ము చేసుకున్నాడు. మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో ద్వారకాపురి వెళ్లే రహదారి పక్కన సర్వే నంబరు 67బై5బీలో రె వెన్యూ పోరంబోకు 534.67 ఎకరాల భూమిలో గ్రావెల్‌కొండ ఉంది. పశువుల మేతకోసం రైతు లు, పశు కాపరులు వినియోగిస్తుంటారు. దీనిపై గ్రామ పెద్ద కన్నేశాడు. సుమారు 20 ఎకరాల్లో వేల క్యూబిక్ మీటర్లు గ్రావెల్ తవ్వకాలు చేసి ఒక్కో టిప్పర్ సుమారు రూ.7 వేల చొప్పున అ మ్ముకున్నాడు. గ్రావె ల్‌ను డొంకరోడ్లు, పట్ట ణంలో లేఅవుట్లలో రోడ్లకు, జగనన్న కాలనీ రోడ్లకు, గుంతలు పూడ్చడానికి, ఇళ్ల బేస్ మట్టాలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు. అధికారులను బెదిరించిన గ్రామ పెద్ద అయిన ఆ నాయకుడు అటువైపు వారు చూడకుండా చేశాడు. చిన్నస్థాయి నుంచి ఐదేళ్లలో అక్రమ గ్రావెల్ తరలింపు ద్వారా కోట్లు సంపాదించాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అప్పటి వైసీపీ ప్ర భుత్వంలో పెత్తందారులు అండ దండిగా ఉండడంతో ఇష్టానుసారంగా ఈ వ్యవహా రాలు నెరిపి ఆస్తులను కూడబెట్టుకున్నాడు.

పెద్ద పెద్ద గోతులుగా మారిన కొండ ప్రాంతం

గ్రావెల్ తరలింపు కోసం కొండ భాగానే కాకుండా భూమి లోపలి భాగాన్ని కూడా 15 అడుగుల లోతు కందకాలు తవ్వేశారు. దీంతో ఆ ప్రాంతమంతా గోతుల మయంగా మారింది. పశువులు, జీవాలు ఆ వైపుగా వెళ్లాలంటే మార్గం లేకుండా పోయింది. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. రెవెన్యూ, మైనింగ్ అనుమతులు లేకుండానే కొండ ప్రాంతంలో యథేచ్ఛగా తవ్వకాలు జరిగాయి. విచ్చలవిడిగా తవ్వకాలు జరిపి గ్రావెల్ తర లిస్తున్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడ లేదు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ అధికా రులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవలే బదిలీపై వచ్చాను

ప్రస్తుతం అక్కడ ఎటువంటి గ్రావెల్ తవ్వకాలు జ ర గడం లేదు. గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. నేను ఇటీవలే బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టాను.

- ఖాజావలి, వీఆర్వో

పదికి పకడ్బందీగా ప్రణాళిక

- ఉమ్మడి జిల్లాలో స్టడీ అవర్స్ ప్రారంభం
- సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ
- ఇప్పటికే 90 శాతంపైగా సిలబస్ పూర్తి
- స్టడీ మెటీరియల్, అల్పాహారం పంపిణీకి ఏర్పాట్లు



గుంటూరులోని ఎస్‌కేబీపీఎం స్కూల్‌లో ప్రత్యేక స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

గుంటూరు(విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్యచరణ సిద్ధం అయింది. సబ్జెక్టుల వా రీగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులు దిశానిర్దేశం చేయడంతో పాఠశాలల్లో రెండు రోజుల నుంచి స్టడీ అవర్స్ ప్రారంభం అయ్యాయి. స్టడీ అవ ర్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు విద్యార్థులకు సబ్జె క్టుల్లో ఉన్న సందేహాలు నివృత్తి చేయడానికి ఉపాధ్యా యులకు ప్రత్యేక టైమ్ టేబుల్‌ను విద్యాశాఖ సిద్ధం చేసింది.

పరీక్ష ఫీజుకు 18 వరకు గడువు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మోడల్ స్కూల్, కేజీబీవీ, గురుకుల పాఠశాలలు 375కుపైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల నుంచి ఈ ఏడాది పది పరీక్షలకు దాదాపు 45,876 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు సమాచారం. ఇప్పటికే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో దాదాపు 95 శాతం మంది పరీక్ష ఫీజు చెల్లించారు. పరీక్ష ఫీజు గడువు ఈనెల 18వ తేదీ వరకు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షలకు సన్నద్ధత దాదాపు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ముమ్మరంగా సాగు తోంది.

90 శాతం సిలబస్ పూర్తి

పాఠశాలల్లో పదో తరగతి సిలబస్ 90శాతం పూర్తి అయింది. సిలబస్ డిసెంబరు రెండో వారంలోగా నూరుశాతం పూర్తి అవుతుం దని ఉపాధ్యాయులు చె బుతున్నారు. ఇప్పటికే వి ద్యార్థులకు నిర్వహించిన ఎఫ్-1,2 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వి ద్యార్థుల్ని గ్రేడింగ్ చేసి శిక్షణ తరగతులు నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్ ని ర్వహిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో సాయంత్రం 4.15 నుంచి 6 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల్ని చదివించడం, సందేహాలు నివృత్తి చేయడం, ముఖ్యమైన ప్రశ్నల్ని చదివించి వారంతంలో పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో సబ్జెక్టు ల్లో వెనుకబడి ఉన్న వారి కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు.

త్వరలో స్టడీ మెటీరియల్ పంపిణీ

పది విద్యార్థుల కోసం జడ్పీ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ త్వరలో పంపిణీ చేయనున్నారు. ఇటీవల జరిగిన సాధారణ జడ్పీ సమావేశంలో ఈమేరకు జడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా పది విద్యార్థులకు పంపిణీ చేసే స్టడీ మెటీరియల్‌పై చర్చించారు. ఇందుకోసం దాదాపు రూ.40 లక్షలకుపైగా వ్యయం చేయనున్నట్లు సమాచారం. ఈ ఏడాది విద్యార్థులకు అల్పాహారం కూడా అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. యాజమాన్యాల వారీగా ఇం దుకోసం ప్రభుత్వం బడ్జెట్‌నుకేటాయించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అనుబంధాలు ఆవిరి

8

- చిన్నారుల్లో కనిపిస్తున్న మానసిక రుగ్మత
- అమ్మ, నాన్నల పూర్తిపేరు కూడా చెప్పలేకపోతున్న వైనం
- తాత్కాలిక ఆనందాలకు అలవాటుపడుతున్న పిల్లలు
- నిర్ధారిస్తున్న సర్వేలు, మానసిక నిపుణులు
- చిన్నారుల మెదడుపై ప్రభావం చూపుతున్న సెల్‌ఫోన్లు
- పెద్దవాళ్లకు దూరంగా ఉండటం కూడా మరో కారణం

శబరిమలకు ప్రత్యేక రైళ్లు



- నేడు విశాఖపట్నం, రేపు గుంటూరు సింహాద్రి రైళ్ల రద్దు

మరికొందరికి పదవులు

6

- రజక, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్లలో అవకాశం

విఠంరాజుపల్లిలో.. గ్రామీణ సంత

- కూరగాయలు పండించే రైతులే విక్రయదారులు
- ఎకరన్నర స్థలంలో రూ.20 లక్షలతో నిర్మాణం
- మోడల్ ప్రాజెక్టుగా నాబార్డు సహకారంతో ఏర్పాటు



వినుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మధ్య దళారులతో ఆరుగాలం రెక్కల కష్టం చేసే రైతుతో పాటు వినియోగదారు లు నష్టపోతున్నారు. ఈ క్రమంలో రైతులే విక్రయదారులుగా మారితే అటు పండించేవారు, ఇటు కొనుగోలు చేసే వారు లబ్ధి పొందవచ్చనే ధ్యేయంతో ప్రభుత్వం చ ర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలో గతంలో ఎ క్కడికక్కడ జరిగే సంతలను తిరిగి ప్రభుత్వం ప్రవే శపెట్టింది. రైతులు నేరుగా తాము పండించిన ఉ త్పత్తులను తెచ్చుకుని విక్రయించుకునేలా గ్రామీ ణ సంతలను నాబార్డు సహకారంతో ఏర్పాటుచేస్తు న్నారు. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ల్లో మోడల్ ప్రాజెక్టుగా వినుకొండ మండలం విఠంరా జుపల్లిలో గ్రామీణసంతను ఏర్పాటు చేశారు. గుం టూరు, కర్నూలు జాతీయ రహదారి పక్కన ఎకర న్నర స్థలంలో రూ.20 లక్షలతో దీనిని నిర్మించారు. ఇక్కడ కూర గాయల క్రయవిక్రయాలకు స్టాల్స్, మరుగుదొడ్లు వసతి, కార్యా లయం నిర్మించారు. హూడ్సి, రిటైల్, హోల్‌సేల్‌కు వేర్వేరుగా రెం డు షెడ్లు నిర్మించారు. వీటిలో 40 స్టాల్స్‌కు వసతి సదుపాయం కల్పించారు. విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం, జాలలపాలెంతోపాటు మరో ఆరు గ్రామాల్లో అత్యధిక విస్తీర్ణం లో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. అయితే సరైన మార్కెట్ వసతి లేక గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లోని మార్కెట్లకు తరలించాల్సి వస్తుంది. సరైన గిట్టుబాటు లేక నష్ట పోతున్నారు. ఈ క్రమంలో ఇబ్బందులు అధిగమించి రైతులకు మేలు చేకూర్చేందుకు గ్రామీణ సంత ఏర్పాటుచేయాలని నిర్ణ యించారు. విఠంరాజుపల్లిలో జాతీయ రహదారి పక్కన స్థలం సమకూరగా మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీ రూ.5లక్షలు కేటాయించగా నాబార్డు రూ.15లక్షలు మంజూరు చేయడంతో సంతను ఏర్పాటుచేశారు.

11 మందితో కమిటీ

గ్రామీణ సంత నిర్వహణకు 11మందితో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటిలో నాబార్డు డీడీఎం, స్థానిక కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్, సర్పంచ్‌తోపాటు మరో 8మంది రై తులు సభ్యులుగా ఉంటారు. రైతులు తాము పండించిన కూర గాయాలను సంతకు తెచ్చి విక్రయించాలి. క్రయవిక్రయాలలో వీరికి మైరాడ సంస్థ తోడ్పాటునిస్తుంది. అవసరమైతే భవిష్యత్ లో సంతకు అనుబందంగా కోల్డ్ స్టోరేజ్ నిర్మించేందుకు కూడా ఆర్థికసంస్థలు హామీ ఇచ్చాయి. రైతులు, వ్యాపారులకు రుణసౌ కర్యం కల్పించేందుకు సహకార బ్యాంకు అధికారులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. గ్రామీణ సంతను త్వరలో ప్రారంభిస్తామ ని మైరాడ ప్రోగ్రామ్ అధికారి మంజునాథ్ తెలిపారు.

రైతులకు మేలు



గ్రామీణ సంత వల్ల రైతుల కు ఎంతోమేలు జరుగుతుంది. 20 ఏళ్లుగా కూరగాయలు పం డిస్తు జీవనోపాధి సాగిస్తున్నా ను. అయితే స్థానికంగా విక్ర యించే వసతి లేకపోవడంతో గుంటూరు, విజయవాడ మా ర్కెట్లకు తరలించాల్సిన వస్తుం ది. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులున్నాయి.

- చెన్నుబోయిన శ్రీనివాసరావు, విఠంరాజుపల్లి

సీఎం, లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే జీవీ



వినుకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. చీఫ్‌విప్ పదవి ఇచ్చినందుకు సీఎంకు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని సీఎంకు చెప్పారు. సమర్థవంతంగా పని చేయాలని ఎమ్మెల్యేకి సీఎం సూచించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు.



ఏపీ లా సెట్, పీజీ ఎల్.సెట్ అడ్మిషన్స్ కౌన్సెలింగ్

- నేటి నుంచి 17 వరకు రెండో విడత ప్రారంభం
- రేపటి నుంచి 19 వరకు ధ్రువపత్రాల పరిశీలన
- ఏపీ లా సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య సత్యనారాయణ

పెదకాకాని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఏపీ లాసెట్ కార్యాలయంలో రెండో విడత ఏపీ లా సెట్, పీజీ ఎల్.సెట్ 2024 అడ్మిషన్స్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ శాస్త్ర కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్, ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2024ను జూన్ 9న నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండో విడత ప్రవేశాల కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎ.పి. లాసెట్ కార్యాలయంలో కన్వీనర్ ఆచార్య బి.సత్యనారాయణ విడుదల చేశారు. నేటి నుంచి ఈ నెల 17 వరకు వెబ్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 15 నుంచి 19 వరకు ఉంటుందన్నారు. ఈ నెల 20 నుంచి 23 వరకూ అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. వెబ్ ఆప్షన్స్‌లో మార్పులకు ఈ నెల 24 వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 26న అడ్మిషన్స్ ఎలాట్‌మెంట్ జరుగుతుందని, 27 నుంచి 29 వరకు అర్హత పొందిన అభ్యర్థులు తమకు కేటాయించిన కళాశాలలో స్వయంగా హాజరు కావాలని కన్వీనర్ తెలియజేశారు.

ఇక.. ఎన్టీఆర్ జలసిరి

(5 పేజీ తరువాయి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఈ పథకం అమలులో చతికిల పడింది. బోరు బావుల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది రైతులు వీటి నిర్మాణం కోసం ఎదురు చూశారు. భూగర్భ జలాలను సమవర్ధవంతంగా సద్వినియోగం చేసుకునేందుకు ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని వైసీపీ పాలకులు ఐదేళ్ల రైతులకు అక్కరకు రాకుండా చేశారు. ఈ పరిస్థితుల్లో రైతుల ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని అమల్లోకి తేవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గతంలో అమలు చేసినట్లుగా ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతులకు ఈ పథకాన్ని వర్తింప చేసేందుకు సిద్ధమైంది. అర్హులైన రైతులకు బోరు నిర్మించడంతో పాటు సోలార్ పంపు సెట్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిస్థితుల్లో బోర్ల నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జలసిరి పథకంలో బోర్ల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయింపుపై దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేలల్లో దరఖాస్తులు పెండింగ్‌లో..

టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం రైతుల కల మన వైఎస్ఆర్ జలకళ అనే నినాదంతో వైఎస్ఆర్ జలకళ పథకాన్ని రూపొందించింది. పథకానికి పేరు మార్చిన వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ బోర్ల నిర్మాణాన్ని అటకెక్కించింది. ఐదేళ్ల బోర్ల నిర్మాణంలో ప్రభుత్వం బొక్కాబోర్లాపడింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో 15,341 మంది రైతుల దరఖాస్తులను ఆమోదించినప్పటికీ బోర్ల నిర్మాణాన్ని విస్మరించింది. బోర్ల నిర్మాణం కోసం ఆశగా ఎదురు చూసిన అన్నదాతలకు ఆడియాసే మిగిలింది. ఈ పథకానికి ప్రధానంగా నిధుల కొరత వెంటాడింది. నిర్మించిన బోర్లకు పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. నిర్మాణం పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వలేకపోయారు. దీంతో వందలాది బోర్లు నిరుపయోగంగా మారాయి. నెలల తరబడి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వకపోవడంతో అవి పూడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. జలసిరి పథకాన్ని జలకళగా మార్చిన వైసీపీ ప్రభుత్వం బోర్ల నిర్మాణాలను నామమాత్రంగా కూడా చేయలేదు. పల్నాడు జిల్లాలో 10,341 మంది రైతులు బోర్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 8,371 దరఖాస్తులను ఆమోదించినా 1,179 బోర్లు మాత్రమే నిర్మించారు. బాపట్ల జిల్లాలో 4524 దరఖాస్తులకు 3,728 ఆమోదించారు. వీటిలో భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి 2279 దరఖాస్తులపైనే సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన వాటిలో 2105 బోర్లు నిర్మాణానికి అనుమతించారు. వీటిలో 1779 బోర్లకు పరిపాలన అనుమతి రాగా 896 బోర్లను మాత్రమే నిర్మించారు. వీటిలో 63 బోర్లు విఫలమైనట్టు గుర్తించారు. 42 బోర్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. గుంటూరు జిల్లాలో 476 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 386 ఆమోదించారు. 181 భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన దరఖాస్తులలో 197 బోర్లు నిర్మాణానికి అనుమతిచ్చారు. వీటిలో 170 బోర్లకు పరిపాలన అనుమతి ఇచ్చారు. 133 బోర్లను మాత్రమే నిర్మించగా వీటిలో 34 పనిచేయడం లేదు. 44 బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

పనుల్లో జాప్యాన్ని నివారించడానికే అధికారి సేవల్ని కోరాం

- పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు(విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్జేడీ కార్యాలయంలో కొత్త అధికారి వచ్చే వరకు వివిధ విభాగాల్లో పనులు జాప్యం లేకుండా ఉండటానికే ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ద్వితీయ శ్రేణి అధికారిని డిప్యుటేషన్‌పై నియమించాలని కమిషనర్‌ను అభ్యర్థించామని పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. 'డిప్యుటేషన్ పేరిట తిష్ట.. అవినీతికి పరాకాష్ట' అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. ఆర్జేడీ కార్యాలయానికి ఉపాధ్యాయుల నుంచి వచ్చే వినతులు, కోర్టు కేసుల పరిష్కారం కోసం కొత్త అధికారి వచ్చే వరకు పాత అధికారి రెండుచోట్ల విధులు నిర్వర్తించేలా కమిషనర్‌ను అభ్యర్థించినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు, ఎన్‌వోసీ జారీ, ఎంఈవోలకు ఎఫ్‌ఏసీ అలవెన్సులు మంజూరులో ఎటువంటి ఇబ్బందులకు గురిచేయలేదనీ, ఆర్జేడీ కార్యాలయంలో అవినీతికి ఆస్కారం లేదన్నారు. ఉపాధ్యాయులు తమ సమస్యలు మెయిల్ ద్వారా పంపవచ్చునని, పనుల కోసం వచ్చే ప్రైవేటు, ఎయిడెడ్ స్కూల్స్ యాజమాన్యం నుంచి సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లు రుజువు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మహిళా కబడ్డీ విజేతగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల

నరసరావుపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ఏఎన్‌యూ అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆటలతో శారీరక, మానసిక ఉత్సాహం కలుగుతుందన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లను అభినందించారు. పోటీల్లో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల మొదటి, ఏఎన్‌యూ యూనివర్సిటీ వ్యాయామ విద్య కళాశాల రెండో, తెనాలి జేఎంజే కళాశాల మూడో, నరసరావుపేట విక్టరీ డిగ్రీ కాలేజి నాలుగో స్థానంలో నిలిచాయి. కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, సతీష్‌బాబు, మహమ్మద్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పీడీ ఈదర ఆదిబాబు, అబ్జర్వర్ డాక్టర్ డి. సూర్యనారాయణ, ధనలక్ష్మి కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు, జేఎంజే కాలేజి డాక్టర్ కె.సుజాత, చేబ్రోలు గవర్నమెంట్ కాలేజికి చెందిన ఎం గణేష్, ఎం.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, సెలక్షన్ కమిటీ సభ్యులు

48,735 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 50,416 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,735 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 30,355 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	14500	334	9000	15500
నెంబరు. 5	8000	13000	నెంబరు. 5	11000	16000
273	9000	12700	273	10500	12500
341	8000	15500	341	8000	16000
4884	--	--	4884	9700	15000
సూపర్ 10	-	-	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	17300	తేజ	8500	17000
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8500	13500
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	9500	13000
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 586.50 అడుగులు ఉంది. ఇది 302.91 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6248, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 8567, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 23,656 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో వాటర్‌గా 23,656 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. రెండు వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

గుజ్జనగుండ్లలో వ్యక్తి దారుణ హత్య

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గుజ్జనగుండ్ల సెంటర్లో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత షేక్ గౌస్ (54) అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. పోలీసుల కథనం మేరకు.. గుజ్జనగుండ్ల నాలుగో లైన్‌కు చెందిన షేక్ గౌస్‌కు భార్య షేక్ ముంతాజ్ ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గతంలో గౌస్ టెంట్‌హౌస్ లో పని చేసుకొని జీవనం సాగించేవాడు. అయితే మద్యానికి అలవాటు పడిన గౌస్‌కు కూలి డబ్బులు సరిపోకపోవడంతో రొంపిచర్ల మండలం విప్పర్లరెడ్డిపాలెంలో ఉంటున్న పెద్ద కూతురు నాగూర్‌బీ వద్దకు వెళ్లాడు. నరసరావుపేటలో ఉంటున్న చిన్న కుమార్తె ఫాతిమా వద్ద తల్లి ఉంటోంది. కాగా కుమారుడు నాగూర్ కూడా నరసరావుపేటలో ఉంటున్నాడు. అయితే గౌస్ మద్యం తాగి ఇంట్లో గొడవ చేస్తున్న క్రమంలో ఇంట్లో వారితో గొడవపడి రెండు నెలల క్రితం గుంటూరు వచ్చాడు. గుజ్జనగుండ్ల లోని శేషయ్య హాస్పటల్ పక్క రోడ్డులోని జేకేసీ నగర్ ఒకటో లైన్‌లోని శ్రీనివాస సప్లయర్స్ అనే టెంట్ హౌస్ నిర్వాహకుడు శ్రీనివాసరావుకు గౌస్ కొంత మొత్తం డబ్బు వడ్డీకి ఇచ్చాడు. ఆయన వద్ద వడ్డీ డబ్బులు తీసుకోవడమే గాక కూలి పనులకు వెళ్లి వచ్చిన డబ్బులతో మద్యం తాగి అక్కడే ఫుట్‌పాత్‌పై పడుకుంటున్నాడు. మంగళవారం రాత్రి సుమారు తొమ్మిదిన్నర గంటల సమయంలో టెంట్ హౌస్ శ్రీనివాసరావు షాపు మూసివేసి ఇంటికి వెళ్లే సమయంలో అక్కడే మద్యం తాగుతూ కనిపించాడు. తెల్లారిన తర్వాత చూడగా గౌస్ రక్తపు మడుగులో చనిపోయి ఉన్నాడు. బలమైన ఆయుధంతో తలపై కొట్టి హత మార్చారు. సమాచారం అందుకున్న పట్టాభిపురం ఎస్ఐ నరహరి సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న మాన్యువల్ కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, బిటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో ప్రవేశాలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ఈ నెల 18వ తేదీన జరుగుతుందని యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ చూడాలన్నారు.

కార్పొరేషన్లలో సభ్యులుగా పలువురు జిల్లా వాసులు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ సభ్యులను నియమించింది. రజక కార్పొరేషన్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నేత రాచకొండ నాగేశ్వరరావు, నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ నేత గుర్రపూసల రామకృష్ణలను సభ్యులుగా నియమించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్లో పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మద్దిరాల గంగారావు, మంగళగిరి నియోజకవర్గ టీడీపీ నేత మున్నంగి శివ శేషగిరిరావు, తెనాలి నియోజకవర్గ జనసేన నేత కురగంటి రఘురామయ్యలను సభ్యులుగా నియమించారు.

దళితుడి పంటను దున్నేసిన వైసీపీ నేత

అమరావతి, నవంబరు 13: మండల పరిధిలోని ఉంగుటూరు గ్రామంలో ఓ పేద ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కౌలు రైతు సాగు చేసిన పత్తి పంటను ట్రాక్టర్‌తో వైసీపీ నాయకుడు దున్నేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉంగుటూరు గ్రామానికి చెందిన దార్ల వరబాబు రెండున్నర ఎకరాల భూమిని పెదపరిమి గ్రామానికి చెందిన రైతుల వద్ద కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. ఉంగుటూరు గ్రామానికి చెందిన వైసీపీ నేత పి.శేషయ్య కౌలు రైతు వరబాబును గత కొద్ది రోజులుగా బెదిరిస్తూ నా పొలంలో నీవు ఎందుకు పంట వేశావని కులం పేరుతో దూషించాడు. వరబాబు సాగు చేసిన పత్తి పంటను నాలుగు రోజుల క్రితం ట్రాక్టర్‌తో దున్ని నేలమట్టం చేశాడు. దీనిపై బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌హెచ్‌వో ఎం.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్నాడు వార్తలు

మంత్రి పార్థసారధికి వనసమారాధన ఆహ్వానం

మాచర్లటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ఈనెల 24వ తేదీన జరగనున్న యాదవ కార్తీక వన సమారాధనలో పాల్గొనాలని కోరుతూ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని యాదవ సంఘ నేతలు కోరారు. వెలగపూడిలో సచివాలయంలో మంత్రిని కలిసి పుష్ప గుచ్ఛం అందించి ఆహ్వానం అందించారు.

సీఎం చంద్రబాబుకు జంగా కృతజ్ఞతలు



చంద్రబాబునాయుడుకు శ్రీ వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా నియమించినందుకు గాను సీఎం చంద్రబాబునాయుడును టీటీడీ పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, ఆయన కుమారుడు, జడ్పీటీసీ జంగా వెంకటకోటయ్యలు కలిసి శ్రీవేంకటేశ్వరస్వామి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు. పాలక మండలి సభ్యులుగా అవకాశం కల్పించినందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు వివరించారు. ఇచ్చిన అవకాశంతో ప్రజాసేవ కోసం పాటుపడతానని జంగా తెలియజేశారు.

జీవీకి మధుబాబు శుభాకాంక్షలు



జీవీకి ఆంజనేయులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మధుబాబు

మాచర్లటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమితులైన వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును బుధవారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వెలగపూడిలోని సచివాలయంలో జీవీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శాసనసభా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమ రాజులను వారి చాంబర్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు **(పెదకూరపాడు)**

ఉర్దూ పాఠశాలలో వైద్యశిబిరం

బెల్లంకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ ఉర్దూ పాఠశాలలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయుష్ వైద్యాధికారి ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్య క్రమం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పాపమ్మ, కరిష్మా, జానీబేగం, ఆయుష్ సిబ్బంది, ప్రభు ప్రసాదు, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల హర్షం

కారంపూడి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు నామినేటెడ్ పోస్టులు కేటాయింపుపై స్థానిక ఆర్యవైశ్యులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా డుండి రాకేష్, కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు నియామకంపై వారు ఆనందం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యులకు సముచితస్థానం కల్పించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

నోటీసులు జారీ

సత్తెనపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో మొండి బకాయిదారులకు బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. శ్రీనివాసమహల్ నిర్వహకులు రూ 2,88,521, సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రి రోడ్డులో బషీర్ అహమ్మద్ అనే వ్యక్తి రూ.52 వేలు చెల్లించాల్సి ఉండటంతో రెడ్ నోటీసులు జారీ చేశారు.

250 లీటర్ల నాటుసారా స్వాధీనం

వెల్దుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపాడులో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్‌ఐ సమందర్‌వలి తన సిబ్బందితో బుధవారం దాడులు చేశారు. ఈదాడుల్లో 250 లీటర్ల నాటుసారా, ఉప్పుతోళ్ల చిన ఏడుకొండలు, మనయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన **అప్పికట్ల వెంకటేశ్వరరావు** గారి కుమారుడు **అప్పికట్ల ప్రవీణ్ కుమార్,** నివాసం డోర్.నెం.7-7/2, కాజా గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా వారి నుండి సమాచారం పొంది తెలియజేయునది ఏమనగా: పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మునిసిపాలిటీ, సత్తెనపల్లి పట్టణము, క్రిస్టియన్ పేట కాపురస్తులు **దావులూరి కోటేశ్వరరావు** గారి భార్య **దావులూరి అన్నపూర్ణ** గారికి సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రారు ఆఫీస్ దాక్యుమెంటు దఖలు దస్తావేజు నెం.**2712/2010**, తేది.**16.04.2010** ద్వారా సంక్రమించి గత 14సం॥లుగా వారి ఆధీనంలో ఉన్నటువంటి దిగువ షెడ్యూలు ఆస్తిని **ఫైవ్ స్టార్ బిజినెస్ ఫైనాన్సు లిమిటెడ్,** అమరావతి బ్రాంచి నందు ఉన్నటువంటి తనఖాను రద్దుపరచి అందులో కొంత భాగమును విక్రయింపజూపగా నాక్లయింటు అయిన **అప్పికట్ల వెంకటేశ్వరరావు** గారి కుమారుడు అప్పికట్ల **ప్రవీణ్ కుమార్** అను వారు సదరు ఆస్తిని కొనుగోలు చేయుటకు సిద్ధముగా ఉండియున్నారు. కావున దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల 15 రోజులలో తెలియజేయవలసినదిగా కోరడమైనది.

షెడ్యూలు: పల్నాడు జిల్లా - నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా సత్తెనపల్లి సబ్ డి. ఇలాకా, సత్తెనపల్లి మునిసిపాలిటి ఏరియాలోని సత్తెనపల్లి గ్రామ డి.నెం.200-1ఎ1 గుర్తు య.11-16ట్లు మింజుమలె 1వ వార్డు, డోరు నెం.6-5-54రుకు పడమరవైపున గల దావులూరి అన్నపూర్ణ గారి హక్కుగల 271చ.గలలో నాక్లయింటు విక్రయించదలచిన ఖాళీ స్థలముకు హద్దులు:- **తూర్పు** : దావులూరి అన్నపూర్ణ గారి నిల్వ స్థలము హద్దు అ61లు, **దక్షిణం** : అన్నెం నారాయణ లోగడ ఇతరులకు విక్రయించిన స్థలం హద్దు అ15లు, **పడమర** : అప్పికట్ల ప్రవీణ్ కుమార్ (నాక్లయింటు) స్థలము హద్దు అ 61లు, **ఉత్తరం** : బజారు హద్దు అ33లు, ఈ హద్దుల మధ్యస్తమున చ.గ.**101.66**లు లేక **85.39** చ.మీ.లు గల ఖాళీ స్థలము కలదు.

సత్తెనపల్లి, **మామిళ్ళపల్లి బాలధ్రువకుమార్,** అడ్వకేట్
తేది: 13.11.2024 సత్తెనపల్లి, పల్నాడు జిల్లా, సెల్ :**9494678793**

ఆస్తిపన్ను వసూళ్లలో జాప్యం

- వసూలు చేసింది రూ.2,44,61,000
- చేయాల్సింది రూ.5,53,08,000
- అధికశాతం నిలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు
- పన్ను వసూళ్లలో వెనుకబడిన సిబ్బంది

సత్తెనపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పురపాలక సంఘ అభివృద్ధి ఆస్తిపన్ను వసూళ్లపైనే ఆధారపడి ఉంటుంది. ఆస్తిపన్ను వసూళ్లతో వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు చేపడతారు. ఆస్తి పన్ను అనుకున్న విధంగా వసూలు కాకపోతే పట్టణాభివృద్ధి కుంటుపడుతుంది. పన్నుల వసూళ్లల్లో పురపాలక సంఘ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ అడ్మిన్‌లు వెనుకబడ్డారని చెప్పవచ్చు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించాల్సిన వారు 16,110 మంది వరకు ఉన్నారు. వీరి ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.7,97,69,000 వసూలు కావాల్సి ఉంది. రూ.2,44,61,000 మాత్రమే వసూలైంది. రూ.5,53,08,000 రాబోయే నాలుగున్నర నెలల్లో వసూలు చేయాల్సి ఉంది. అధిక శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచే బకాయిలు నిలిచిపోయాయి. వీటిలో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు 94శాతం వరకు ఉన్నాయి. వీటి నుంచి రూ.1,21,51,000 వసూలు కావాల్సి ఉండగా రూ.10.47 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ.1,11,04,000 వసూలు కావాల్సి ఉంది. పట్టణ ప్రజల నుంచి వసూలు కావాల్సిన రూ.6,76,18,000లకు గాను రూ.2,34,14,000 మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ.4,42,04,000 వసూలు చేయాల్సి ఉంది. ఖాళీ స్థలాలు 941 ఉండగా రూ.46.35 లక్షలు పన్ను వసూలు కావాల్సి ఉంది. కేవలం రూ.9.57 లక్షలు నేటికి వసూలైంది. ఇంకా రూ.36.78 లక్షలు వసూలు కావాల్సి ఉంది. నీటి కుళాయిలు 7,713 ఉన్నాయి. వాటి నుంచి పన్ను రూ.2,71,00,059 వసూలు కావాల్సి ఉండగా నేటికి రూ.26.13 లక్షలు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.2,45,46,000 వసూలు కావాల్సి ఉంది. పేరుకు పోయిన బకాయిలు అధికంగానే ఉన్నాయి. పన్ను వసూళ్ల ఎందుకు వసూలు కావటం లేదో అధికారులకే తెలియాలి. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ అడ్మిన్‌లు పన్ను వసూళ్ల విషయంలో నామమాత్రంగానే వ్యవహరిస్తున్నారు. పన్ను వసూళ్లకు వెళ్లి బకాయిదారుల వద్ద పన్నులు వసూలు చేయకుండా అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



పురపాలక సంఘ కార్యాలయం

పన్ను వసూళ్లను వేగవంతం చేశాం

● మున్సిపల్ కమిషనర్ షమ్మి



పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని వేగవంతం చేశాం, ప్రతి రోజు సచివాలయ సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి లక్ష్యాన్ని చేరుకుంటాం. పురపాలక సంఘంలో 2024 - 25 సంవత్సరానికి సంబంధించి రెండో అర్ధ సంవత్సరానికి ఎటువంటి వడ్డీ లేకుండా పన్నులు చెల్లించవచ్చు.

రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌పై వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై గళం విప్పలేని జగన్‌కు బడ్జెట్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేలా బడ్జెట్ ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసం బయట పడుతుందనే భయంతో తప్పుడు లెక్కలు చెపుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలతో పాటు పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ ఏర్పాటు, ఉచిత ఇసుక పథకాలను అమలు చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేయటం తో పాటు సూపర్ - 6 పథకాలు అమలు చేసే దిశగా బడ్జెట్‌ను రూపొందించిందన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం ప్రపంచ స్థాయి కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానించేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో కొత్త కంపెనీలు రాక పోగా కమిషన్‌ల కోసం వైసీపీ నాయకులు వేధించటంతో ఉన్న కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని గుర్తు చేశారు. ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించిన జగన్‌కు రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. వైసీపీ పాలనలో కుదేలైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చంద్రబాబునాయుడు కష్టపడుతున్నారన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదనే సాకుతో జగన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటం సిగ్గు చేటన్నారు.

పులిచింతల బ్యాక్ వాటర్‌పై ఎత్తి పోతల పథకం నిర్మించాలి

● మంత్రి లోకేశ్ హామీ నెరవేర్చాలి ● సీపీఎం మండల మహాసభ తీర్మానం

క్రోసూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచింతల బ్యాక్ వాటర్‌ను బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో కలిపే విధంగా ఎత్తి పోతల పథకం నిర్మిస్తామని యువగళం పాదయాత్ర సమయంలో ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని క్రోసూరు మండల సీపీఎం మహాసభ డిమాండ్ చేసింది. ఈ మహాసభ బుధవారం దొడ్లేరులో నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, గంజిమాల రవిబాబు మాట్లాడుతూ క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాలకు ప్రతి ఎకరాకు సాగు నీరు అందాలంటే ఎత్తిపోతల పథకం నిర్మించాలన్నారు. పొలాలకు సమృద్ధిగా సాగునీరు అందితేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. పులిచింతల బ్యాక్‌వాటర్ ఎత్తిపోతల పథకం కోసం మూడు మండలాల రైతులను సంఘటిత పరచి ఉద్యమం చేయనున్నట్లు వారు తెలియజేశారు. క్రోసూరులో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, అచ్చంపేట మండలంలో రెవెన్యూ ఫారెస్టు సరిహద్దుల్లో పేదలకు పట్టాలు ఇచ్చిన భూముల సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం క్రోసూరు మండల కమిటీ కన్వీనర్‌గా తిమ్మి శెట్టి హనుమంతరావును, కార్యవర్గ సభ్యులుగా చిలకా ఏసయ్య, ఏపూరి వెంకటేశ్వర్లు, సయ్యద్ హుస్సేన్, గంజిమాల మధుసూదనరావు, రావిళ్ల వెంకటేశ్వర్లు, ఎలిశమ్మలను కమిటీ సభ్యులుగా నియమించారు. ఆవుల ఆంజనేయులు, దగ్గుల నటరాజు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ ఇవ్వాల్సిందే !

● దరఖాస్తులను తిప్పిపంపుతున్న రెవెన్యూ అధికారులు

పిడుగురాళ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నమోదైన దరఖాస్తుల్లో కొందరు బీఎల్వోలు 10వ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లను జత చేయాల్సిందే, అవి లేకుండా కుదరదంటూ దరఖాస్తులను తిరస్కరించే పరిస్థితి కనిపించింది. బుధవారం పిడుగురాళ్ల నుంచి డివిజన్ కార్యాలయానికి వెళ్లిన ఫారం-18 దరఖాస్తుల్లో కొన్నింటిని రెవెన్యూ అధికారులు ప్లస్ 2 సర్టిఫికెట్లు లేవని వెనక్కి పంపారు. బుధవారం బీఎల్వోలు కొందరు దరఖాస్తుదారులకు ఫోన్‌చేసి ఆ రెండు సర్టిఫికెట్లు ఇవ్వండి.. లేదంటే ఫారం-18ని తిరస్కరిస్తామంటూ ఫోన్లు చేస్తున్నారని తెలిపారు.

సూపర్ పాస్పేట్ ఎరువును దుక్కిలో వేసుకోవాలి : డీడీఏ

మాచవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు మిర్చి పంట సాగు విషయంలో సూపర్ పాస్పేట్ ఎరువును దుక్కిలో వేసుకోవాలని, అలా కుదరని ఎడల ప్రస్తుతం సూపర్ పాస్పేట్ ఎరువును వాడినట్లయితే కాలుష్యం, జింకు, పొటాష్, పోషకాలు లభిస్తాయని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి సూచించారు. బుధవారం మాచవరంలోని పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పంటలను పరిశీలించారు. అనంతరం సచివాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, సర్పంచ్ నరేష్, ఏవో కే రామమ్మ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

104 ఉద్యోగుల నిరసన

మాచర్లటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశా రు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

● మాచవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ 104 ఉద్యోగులు మాచవరంలో అంబేద్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. 104 డీఈవో అశోక్, పైలెట్ రవీంద్రలు వినతిపత్రం అందించారు.

నూరుశాతం వసూలు చేయాలి

● మున్సిపల్ ఆర్‌డీ హరికృష్ణ

పిడుగురాళ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి మున్సిపాల్టీలో నెలాఖరు నాటికి ఇంటిపన్ను వసూళ్లు పూర్తిచేసేలా సిబ్బంది పని చేయాలని మున్సిపల్ ఆర్‌డీ సూర్యదేవర హరికృష్ణ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తున్నానని ఆరోపణలు, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనం తరం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ఆర్‌డీ హరికృష్ణ, కమి షనర్ శ్రీధర్, మేనేజర్ మొహిద్దీన్, ఆర్‌ఐ వెంకటేశ్వరరావు, ఏఈ చంద్రశేఖర్, తదితరులు పరిశీలించారు.

రిజర్వాయర్లో యువకుడి మృతదేహం లభ్యం

● ఎస్‌ఐ నాగార్జున



అఖిల్ (ఫైల్‌ఫొటో)

రెంటచింతల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి మృతదేహం మంచికల్లు రిజర్వాయర్‌లో బుధవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన అఖిల్ ఈనెల 11న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదే రోజు బుగ్గవాగు రిజర్వాయర్ ఒడ్డున మొబైల్, పాదరక్షలు లభ్యమయ్యాయి. ఆ మేరకు మత్సకారులతో గాలింపు చేపట్టగా మృతదేహం రిజర్వాయర్‌లో లభ్యమైందన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభు త్వాసుపత్రికి తరలించామన్నారు. తండ్రి అంజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

● అఖిల్ మృతికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాట్లు ఫోన్ ద్వారా చెప్పారు.

మేజర్ కాలువలో మృతదేహం లభ్యం

గురజాలటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత అంబాపురం, గోగులపాడు గ్రామాల మధ్య మేజర్ కాలువలో బుధవారం మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహం పట్టలో కట్టి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహం వద్ద సెల్‌ఫోన్ ఉండడంతో దాని ద్వారా సమాచారం తెలుసుకున్నారు. అతడిది తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దోనపాముల గ్రామానికి చెందిన షేక్ షరీఫ్ (40)గా పోలీసులు గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో హత్య చేసి ఉంటారని బావిస్తున్నారు. పోలీసులు అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గురజాలటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని కొత్త అంబాపురం వద్ద జరిగింది. రెంటచింతల మండలం రెంటాలకు చెందిన కొర్రా కృష్ణనాయక్ (30) ఆటో డ్రైవర్‌గా జీనవం సాగిస్తున్నాడు. పత్తి కూలీలకు సంబంధించిన ఆటో కూలీ డబ్బులు కోసం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. కొత్తఅంబాపురం శివారులోని కోల్డ్‌స్టోరేజీ సమీపంలో ఎద్దులబండిని వెనుకగా ఢీకొట్టాడు. బైకు అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



ఫణిదంలో పార్టీ కార్యకర్తకు సభ్యత్వ నమోదు చేస్తున్న కన్నా నాగరాజు

సత్తెనపల్లి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిదంలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. గ్రామంలో 50 మందికి సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు నిమ్మగడ్డ పూర్ణయ్య, కట్టావారిపాలెం మాజీ సర్పంచ్ బండారుపల్లి నరసింహారావు, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఇద్దరికి జీవితకాల సభ్యత్వం



మస్తాన్ షరీఫ్, రసూల్

బెల్లంకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో టీడీపీకి చెందిన ఇద్దరు శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నట్లు బుధవారం పేర్కొన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ త్రిసభ్య కమిటీ మెంబరు, టీడీపీ సీనియర్ నాయ కుడు పీఎస్‌కే రసూల్ శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. వీరిని మండల టీడీపీ నాయకులు అభినందించారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

ముప్పాళ్ళ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దళితుల విద్యాభివృద్ధికి కార్ఫ్ సంస్థ కృషి చేస్తుందని కార్ఫ్ సంస్థ పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ పీ సుబ్బారావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముప్పాళ్ళ ఆర్‌సీఎం స్కూల్లో బుధవారం జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథి గా పాల్గొని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ మన్నం కోటేశ్వరరావు, కందుల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్లబండలాగుడు పోటీలు

కారంపూడి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాదన ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 30వ తేదీ నుంచి స్థానిక వీర్ల దేవాలయ సరిహద్దుల్లో తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కూటమి నేతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం కారంపూడిలో ఎడ్ల బండలాగుడు పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అంజయ్య

కారంపూడి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరుల ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు అన్న వసతులు కల్పిస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య అన్నారు. ఈనెల 30వ తేదీన ప్రారంభం కానున్న కారంపూడిలో ప్రారంభంకానున్న వీరుల ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం వీరులగుడి ప్రాంగణంలో అంజయ్య, గ్రామ సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్‌లు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుడి ప్రాంగణంలోని పిచ్చి చెట్లు, కంపచెట్లను తొలగించే పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తండా మస్తాన్‌జానీ, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, పలిశెట్టి రాఘవ, పల్నాటి వీరాచార పీఠాధిపతి తరుణ చెన్నకేశ అయ్యవారు, నిర్వాహకులు బొగ్గవరపు విజయ్‌కుమార్, ఆర్యవైశ్య యువజన సంఘ నేత శంకర్, పంచాయతీ కార్యదర్శి కసిన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లకపోవడం ప్రజలను మోసం చేయడమే

● కాంగ్రెస్ పార్టీ నాయకుల విమర్శ

దాచేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు వెళ్లకపోవడం ఓటు వేసి గెలిపించిన ప్రజలను మోసం చేయడమేనని కాంగ్రెస్ కమిటీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి కరాలపాటి జానీ విమర్శించారు. బుధవారం జానీ మాట్లాడుతూ ప్రజలు వైసీపీకి 11 సీట్లు ఇస్తే ప్రతిపక్ష హోదా ఎలా వస్తుందని ప్రశ్నించారు. సమావేశాలకు రానప్పుడు ఎమ్మెల్యేలుగా జీతభత్యాలు, గన్‌మెన్‌లు, ఇతర ప్రభుత్వ సదుపాయాలు వద్దని స్పీకర్‌కు లేఖరాసి వైసీపీ ఎమ్మెల్యేలు తమ నిజాయితీని నిరూపించుకోవాలన్నారు.

పశువుల ఆరోగ్యంపై పశుసంవర్ధకశాఖ కృషి

● డాక్టర్ నంబుల సుజాత, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్





నకరికల్లు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పశువుల, గొర్రెలు, మేకలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నాం. గొర్రెల, మేకల నట్టల నివారణకు వ్యాక్సినేషన్‌ను అందజేస్తున్నాం. ఉపాధి హామీ ద్వారా పశువులకు మేతను బహుళజాతి పశు గ్రాస పెంపకం ద్వారా అందిస్తున్నాం అని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ నంబుల సుజాత అన్నారు. ఆమె ఆంధ్రజ్యోతితో ఫటాఫట్..

ప్ర: ప్రస్తుతం పశు సంవర్ధకశాఖ ఏ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది?

జ: అఖిల భారత పశుగణనలో భాగంగా మండలంలోని పశువులన్నింటినీ కేటగిరీల వారీగా లెక్కిస్తున్నాం.

ప్ర: పశుసంవర్ధక శాఖ ద్వారా ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

జ: పశు సంవర్ధక శాఖ ద్వారా గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందును ఉచితంగా అందజేస్తున్నాం. ప్రత్యేక పశు వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి గొర్రెలు, మేకలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నాం.

ప్ర: పాడి పశువుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: పశు సంవర్ధక శాఖ ద్వారా ఆడ దూడల సెమన్ అభివృద్ధి కోసం పశు జాతి పెంపుదలకు కృషి చేస్తున్నాం. ఆడ దూడలే పుట్టే విధంగా(సెక్స్ సార్టెడ్ సెమన్)ఎస్‌ఎస్‌ఎస్ విధానంలో రైతులకు సబ్సిడీపై అందజేస్తున్నాం. ఈ విధానంలో పొరపాటున ఫెయిల్ ఐతే సబ్సిడీని తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంది.

ప్ర: వేసవిలో పశుగ్రాస నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: బహు వార్షిక పశుగ్రాస పెంపకంలో భాగంలో పది సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు రైతులు సాగు చేసుకొనే అవకాశాన్ని ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు అందిస్తున్నాం. ఆసక్తి గల రైతులు పశుగ్రాసాన్ని సాగు చేసుకోవచ్చు. జిల్లాకు వెయ్యి ఎకరాలను పశుగ్రాస సాగుకు ప్రభుత్వం నిర్ణయించింది.

మాదిగ శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి



కొండలు, రాళ్ళతో ఉన్న శ్మశాన స్థలం



క్రోసూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెరికపాడులో మాదిగ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఆ వర్గాల వారు కోరుతున్నారు. గతంలో దొడ్లేరు రోడ్డు పక్కన ఉన్న 75 సెంట్ల పోరంబోకు స్థలంలో మృతదేహాలను ఖననం చేసేవారమని, క్రమంగా ఆ స్థలం ఆక్రమణకు గురై ప్రస్తుతం 20 సెంట్లు మాత్రమే మిగిలిందని వారు తెలిపారు. అది కూడా రాళ్ళు, గుట్టలతో నిండి అనుకూలంగా లేదన్నారు. గ్రామంలో తమ జనాభా ఐదు వందల వరకు ఉందని, 70 గృహాల వరకు ఉన్నాయని వారు చెప్పారు. శ్మశాన వాటిక లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని, అధికారులు స్పందించి తమ కులం వారికి శ్మశాన వాటిక కోసం వెంటనే స్థలాన్ని కేటాయించాలని, లేదా ప్రస్తుతం ఉన్న స్థలంలోనే ఆక్రమణలు తొలగించాలని వారు కోరారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్ రక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలి

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరిత్యాలు, మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించే ఎన్‌డీఆర్‌ఎఫ్ చర్యలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ధ్యానబుద్ధ పుష్కరఘాట్ వద్ద 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది నిర్వహించిన జిల్లా స్థాయి ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కృష్ణానదిలో ప్రమాదవశాత్తు గల్లం తైన వారిని రక్షించే విధానం, మృతదేహాలను నదిలో నుండి బయటకు తీసే విధానం, ముంపు సమయాలలో అందుబాటులో ఉన్న వస్తువులతో రక్షణ పొందే విధానం తదితర అంశాలపై ప్రయోగాత్మకంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎస్‌హెచ్‌వో ఎం శ్రీనివాసరావు, ఎంపీడీవో పార్వతి, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ వివాదాల పరిష్కారానికి వన్‌స్టాప్ సెంటర్ ఏర్పాటు

● జిల్లా అధికారి సుప్రజ

క్రోసూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ వివాదాల పరిష్కారం కోసం, భార్యభర్తల వివాదాల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో వన్‌స్టాప్ సెంటర్‌ను ఏర్పాటు చేయటం జరిగిందని జిల్లా అధికారి సుప్రజ తెలియ జేశారు. బుధవారం క్రోసూరులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జరిగిన బేటీ బజావో, బేటీ పఢావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భార్యాభర్తలు చిన్న చిన్న గొడవలతో విడాకుల వరకు వెళ్తున్నారని, వారికి వన్‌స్టాప్ సెం టర్లో కౌన్సెలింగ్ ఇస్తారని, అవసరమైతే న్యాయ సలహాలు కూడా ఇస్తారన్నా రు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొడక్షన్ యూనిట్ అధికారి జే ప్రశాంతి, ఎంఈవో - 2 గణేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఎంపీపీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలి

అచ్చంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, మహిళలపై వివక్ష తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండా లని బాలికల రక్షణ అధికారి ప్రశాంతి అన్నారు. బుధవారం మండల పరి షత్ కార్యాలయంలో అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, పీహెచ్‌సీ సిబ్బందికి బాలికల వ్యవస్థపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల సంక్షేమ సేవలు, సామర్థ్యాలు మెరుగుపడే విధంగా పథకాల లక్ష్యాలను ప్రజలకు తెలియ జేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం, బాల త్రిపుర సుందరి, డిప్యూటీ తహసీల్దార్, ఈవోపీఆర్‌డీ తదితరులు పాల్గొన్నారు.

అనుబంధాలు

ఆవిరి



● చిన్నారుల్లో కనిపిస్తున్న మానసిక రుగ్మత ● అమ్మ, నాన్నల పూర్తిపేరు కూడా చెప్పలేకపోతున్న వైనం ● తాత్కాలిక ఆనందాలకు అలవాటుపడుతున్న పిల్లలు ● నిర్ధారిస్తున్న సర్వేలు, మానసిక నిపుణులు ● చిన్నారుల మెదడుపై ప్రభావం చూపుతున్న సెల్‌ఫోన్లు ● పెద్దవాళ్లకు దూరంగా ఉండటం కూడా మరో కారణం

బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

సాంకేతిక యుగంలో మన పిల్లలకు అన్ని నేర్పుతున్నామన్న భావన నేటి తరం తల్లిదండ్రుల్లో ఉంది. వేగంగా వృద్ధి చెందుతున్న ఆధునిక సమాజానికి అనుగుణంగా తమ పిల్లలను మరల్చుతున్నామని గట్టిగా నమ్ముతున్నారు. కానీ ఎప్పుడైన వారి ఎదురుగా కూర్చుని బంధాలు గురించి చెప్పారా.. కనీసం మీ పేర్లు అయిన వారికి తెలుసో లేదో గమనించారా.. రక్తసంబంధీకుల గురించి తెలుసో లేదో కనుక్కున్నారా.. అంటే ప్రతి తల్లితండ్రి ఒక్కసారి ఆలోచనలో పడతారు. 12 సంవత్సరాలలోపు పిల్లలకు తమ తల్లి, తండ్రి పూర్తి పేరు కూడా తెలియదనే విషయాన్ని అనేక సర్వేలు నిర్ధారించాయి. సమాచారం, విజ్ఞాన అవసరాల కోసం మొబైల్ వాడకాన్ని అనుమతిస్తే, వ్యక్తిగత నియంత్రణ లోపించి ఎలా వినాశనానికి దారి తీస్తుందో ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే అర్థమవుతుంది.



గుంటూరు(తూర్పు), నవంబరు 13: అల్లరి చేసే పిల్లల చేతిలో ఫోన్లు, ట్యాబ్‌లు అందించి వారి అల్లరిని మాన్పించామని సంతోష పడతాం. కాని అదే పిల్లల పాలిట అశనిపాతంగా మారుతోంది. అటువంటి చిన్న తప్పిదాలు బంధాలను బలహీనం చేస్తున్నాయి. అది ఏస్థాయిలో అంటే తమ తల్లిదండ్రుల పేర్లు కూడా వారికి తెలియని పరిస్థితికి చేరుకుంటోంది. తల్లి దండ్రులు, పిల్లల మధ్య పెరుగుతున్న దూరానికి, అనాధిగా భారతీయ సంస్కృతికి మూలమైన కుటుంబ వ్యవస్థకు బీటలు పడుతున్నాయన్న చేదునిజాన్ని ప్రతిబింబిస్తోంది. ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం, పెద్దవారికి దూరంగా పిల్లలను ఉంచడమే ఈ దుస్థితికి కారణం అని చెప్పుకోవాలి.

75 శాతం మందికి తెలియదు

తల్లిదండ్రుల మధ్య అనుబంధాన్ని అంచనా వేయడానికి హైదరాబాదు విశ్వ విద్యాలయానికి చెందిన హెల్త్ టెక్నాలజీ వారు సర్వే నిర్వహించారు. ఈ సర్వే నివేదిక ప్రకారం.. అమ్మ, నాన్నను గుర్తు పడతారు కాని వారి పేర్లు తెలియని 4-7 మధ్య వయస్సు కలిగిన వారు, ఇతర బంధువులను కనీసం గుర్తించలేని వారు 62 శాతం, ముద్దు పేర్లుకు అలవాటుపడి వారి పేరు కూడా గుర్తులేని వారు 39 శాతం, పేర్లు తెలుసు కాని పూర్తి పేరు (ఇంటి పేరుతో సహా) తెలియని 7-12 మధ్య వయస్సు కలిగిన వారు 65 శాతం ఉన్నారు. 13- 18 మధ్య వయస్సు కలిగిన వారిలో తల్లి, తండ్రుల పుట్టినరోజు తెలియని వారు 62 శాతం, తండ్రి విద్యార్హత తెలియని వారు 63శాతం, తండ్రికి ఇష్టమైన ఆహారం ఏమిటో తెలియని వారు 60 శాతం, అమ్మ, నాన్న ఏ విషయాలకు సంతోషడ తారో తెలియని వారు 80 శాతం ఉన్నారు. యువతలో 23 శాతం మందికి తమ తల్లిదండ్రుల వృత్తి ఏమిటో కూడా తెలియదు.

నేర్పించే వారు లేకనే..

గణాంకాల మాట పక్కనబెడితే నవతరం పిల్లలు, తల్లిదండ్రుల మధ్య పెరుగుతున్న బాంధవ్యాలకు ప్రస్తుత పరిస్థితులు అద్దం పడుతున్నాయి. ఉమ్మడి కుటుంబాల్లో ఉండే పిల్లల్లో ఇటువంటి పరిస్థితి లేదు. కేవలం చిన్న, చిన్న కుటుంబాలు, పెద్దవారికి దూరంగా ఉండే పిల్లల్లోనే ఈ పరిస్థితి కనబడుతుంది. తల్లిదండ్రులు సంపద సృష్టిలో పడిపోయి తమను పట్టించుకోరనే భావనలో ఉండిపోవడంతో వారి సమాచారంపై పిల్లలు ఆసక్తి చూపడం లేదు. సరిగ్గా ఇదే సమయంలో స్నేహితులు, అపరిచితులను ఆహ్వానించి తాత్కాలిక ఆనందాల కోసం అన్వేషిస్తూ ఉంటారు.



కాఠిన్యం వద్దు

కొంతమంది తల్లిండ్రులు తమ పిల్లలను దారిలో పెట్టాలని చాలా కఠినంగా వ్యవహరిస్తుంటారు. కాని ఇది హద్దు మీరితే బెడిసి కొడుతుందని, సృజనాత్మకతని దెబ్బతీస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరీ కాఠిన్యం మంచిది కాదని సూచిస్తున్నారు. నచ్చజెప్పడం, సాధారణ పద్ధతిలో భయం పెట్టడం వంటి చేయవచ్చు.



పెద్దలు లేకపోవడం మరో కారణం

చిన్ననాటి నుంచే అమ్మ, అత్త, తాత అనే పదాలను పిల్లలచేత పెద్దలు నేర్పుతూ ఉంటారు. ఆ వయస్సు నుంచే వారి జ్ఞాపకాల్లో బంధాలు అనే విత్తును నాటతారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. తమ జీవిత విశేషాలు, ప్రధాన ఘట్టాలు, ప్రాథమిక అంశాలు కూడా తల్లిదండ్రులు పిల్లలతో పంచుకోవడం లేదు. అలాగే భోజనసమాయాలు, పండుగలు, ఖాళీ సమయాలను గుణాత్మకంగా ఉపయోగించడంలో తల్లిదండ్రులు విఫలమవుతున్నారు. కుటుంబ నిర్ణయాల్లో పిల్లలను భాగస్వాములను చేస్తే వారికి బాధ్యతలు అలవాటుపడటమేగాక, తల్లిదండ్రులపై గౌరవం, ఇష్టం బలపడాతాయి.



చికాకు.. ఆందోళన..



జీవితాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దుకోవడానికి వేదిక కుటుంబవ్యవస్థ ఒక్కటే. అటువంటి ఆత్మీయ ఆనందాలు లేకుండా, ఒంటిరిగా ఉంటూ ఆకలి, ఇతర అవసరాలకు మాత్రమే స్పందిస్తే అది ఒక విధంగా మానసిక రుగ్మత లాంటిది. ఇలాంటి అలవాట్లు బారిన పడితే మానసిక వ్యాధుల బారిన పడతా రని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. పెద్దలకు దూరంగా ఉంటూ, ఎక్కువ చిరాకు. తమను తాము నిధించుకోవడం, ఇతరులు ఎదురుపడకుండా దాక్కోవడం, నిరంతరం తీవ్రమైన ఆందోళ నలో ఉండటం, గందరగోళ పరిస్థితుల్లో వంటి లక్షణాలు వీరిలో కనిపిస్తూ ఉంటాయి. ఒక దశ దాటిన తరువాత నిద్రాహారాలు మానివేయడం, దూకుడుగా ప్రవర్తించడం వంటివి చేస్తాయి. స్మార్ట్ ఫోనుకు బానిసవుతున్న పిల్లల్లో నైపుణ్యాలు తగ్గుతాయని మానసిక వైద్యులు చెబుతున్నారు. మిగిలిన వారితో పోల్చుకుంటే స్మార్ట్ ఫోన్‌కు బానిసలవుతున్న పిల్లలు అధికంగా కుంగబాటుకు గురువుతున్నారని హెచ్చరించారు.

● ఒకసారి అడిగి చూడండి

- అమ్మ, నాన్న పేర్లు, ముఖ్యమైన బంధువుల ఇంటి పేర్లతో చెప్పమనండి. వరసల అడగండి.
- పుట్టిన ఊరు. అక్కడ ఎవరెవరు ఉంటారు.
- బంధువుల్లో తమ వయస్సు ఉన్న పిల్లలు పేర్లు
- ఫోను నెంబరు,ఇతర సమాచారం చెప్పండి
- సోదరి, లేదా సోదరుడు ఏమి చదువుతున్నాడు, పూర్తి పేరు
- తల్లి దండ్రుల వృత్తి, పుట్టిన తేది, వారి జీవితంలో ముఖ్య ఘట్టాల తేదీలు

పై ప్రశ్నలకు సమాధానలు చెబితే పిల్లలకు చదువుతోపాటు, కుటుంబంపై ప్రాథమిక అవగాహన ఉన్నట్లుగా భావించండి. లేని పక్షంలో నేర్పే ప్రయత్నం చేయండని మానసిక వైద్యులు సూచిస్తున్నారు.

పెద్దవారే వైద్యులు

-డాక్టర్ వెంకటకిరణ్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్

ఇటువంటి సమస్యలకు పెద్దవారే వైద్యులు. అస్తిత్వాన్ని కోల్పోతున్న బాంధవ్యాలను కాపాడుకోవడం మన కర్తవ్యం. సంపద కోసం వెచ్చించడం మాని పిల్లల్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలి. లేని పక్షంలో ఇలాంటి చిన్న, చిన్న సమస్యలకు కూడా ఆస్పత్రుల అవసరం భవిష్యత్‌లో ఏర్పడుతుంది.



సమయాన్ని కేటాయించాలి

- వై అరుణకుమారి, హెడ్ నర్స్ జీజీహెచ్

పిల్లల కోసం తల్లిదండ్రులు సమయాన్ని కేటాయించి, వారి అనుభవాలను పంచుకోవాలి. డబ్బు ఉంటే అన్ని అవే వస్తాయి అని నేటితరం తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. చదువు తప్ప మరేది ముఖ్యం కాదు అనుకుంటున్నారు. తల్లిదండ్రుల ప్రేమను ఆస్వాదించే పిల్లలు బయట లభించే తాత్కాలిక సంతోషాలకు లొంగరు.



సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం: మన్నవ



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సుపరిపాలనను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమితుడైన మన్నవ మోహనకృష్ణ అన్నారు. టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబు, లోకేశ్‌ను మర్యాదపుర్వకంగా కలిశారు. తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని టెక్నాలజీని ఉపయో గించి ప్రజాసేవ చేస్తానని వారికి మోహనకృష్ణ తెలియజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. నూతన సాంకేతికతతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యువనేత నారా లోకేశ్ టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి కృషి చేస్తున్నారని, ఐటీశాఖ మంత్రిగా ఉన్న ఆయన రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల కోసం మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని, రానున్న ఐఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ ఛైర్మన్‌గా లోకేశ్ ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నారని, ఆయన కృషితో రాష్ట్రంలో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సిద్ధమైందని అన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఒప్పందం

యూకే సంస్థతో ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఎంవోయూ

గుంటూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వ్యవసాయ విప్లవానికి పునాదులు వేసే దిశగా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అడుగులు వేస్తోంది. వ్యవసాయానికి తీవ్ర అడ్డంకిగా మారిన వాతావరణ సమస్యలను ముందే గుర్తించి, పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తున్న యూకేలోని సెంటర్ ఫర్ అగ్రికల్చర్, బయో సైన్స్ ఇంటర్నేషనల్ సంస్థతో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు సంస్థల మధ్య శిక్షణ, సామర్థ్యం



ఒప్పంద కార్యక్రమంలో వీసీ శారదా జయలక్ష్మి, రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్

పెంపు, సమాచార మార్పిడి, పంటల ఆరోగ్య సంరక్షణ సమాచారం వ్యాప్తి అంశాలపై ఒప్పందం కుదిరింది. నూతన ఒప్పందం నేపథ్యంలో సెంటర్ ఫర్ అగ్రికల్చర్, బయో సైన్స్ ఇంటర్నేషనల్ సంస్థలోని డిజిటల్ టూల్స్ విభాగం పంటలను కాపాడుకునేందుకు అవసరమైన సమాచారం వ్యవసాయ యూనివర్సిటీకి అందజేస్తుంది. ఒప్పంద పత్రాలను వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి దేవి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, సీఏబీఐ నుంచి సౌత్ ఆసియా రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్, గ్లోబల్ టీమ్ లీడర్ డాక్టర్ మాళవిక చౌదరి, కో ఆర్డినేటర్ మధుమంజరి, విస్తరణ సంచాలకులు డాక్టర్ శివన్నారాయన, డాక్టర్ రమణ, డాక్టర్ మణి, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ పి.రవి, జాయింట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, యూనివర్సిటీ పీఆర్‌వో డాక్టర్ వి.విశాలాక్షి పాల్గొన్నారు.

అనుసంధానం

(5వ పేజీ తరువాయి)

ప్రదేశం కనిపిస్తుంది. తద్వారా వారికి అత్యవసర సహాయాన్ని అందించవచ్చు. వారిని సంరక్షించడానికి తగిన సలహాలు, సూచనలు చేయవచ్చు.

సమస్యల సత్వర పరిష్కారం

జియో ట్యాగింగ్ ద్వారా సమస్యలను సత్వరం పరిష్కరించవచ్చు. ఒక గ్రామంలో తలెత్తిన సమస్య గురించి ఒకరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే, ఆ సమస్య పరిష్కరించాలంటే ఆ వ్యక్తి ఫోన్ నెంబరు, నివసించే ప్రాంతం ఇతర వివరాలన్నీ అధికారులు నమోదు చేసుకుంటేగానీ ఆ ప్రాంతానికి వెళ్లి ఆ సమస్య పరిష్కారం చేయలేరు. దీనికోసం ఎంతో సమయం వృధా అవుతోంది. ఫిర్యాదులో ఇచ్చే మొబైల్/ఆధార్ నెంబర్ ఆధారంగా ఒక్క సెకనులో ఫిర్యాదుదారు అడ్రస్‌ను కనుగొనేందుకు ఈ పద్ధతిలో వీలు కలుగుతుంది. ఆధార్ నెంబర్ ఒకసారి నమోదు చేస్తే చాలు.. మొత్తం వివరాలు అధికారుల ముందుకు వచ్చేస్తాయి. ఆ వ్యక్తి ఉండే ప్రాంతాన్ని నేరుగా మ్యాపులోనే చూడవచ్చు. తద్వారా నేరుగా ఆ ప్రాంతానికి చెందిన అధికారులకు ఆ బాధ్యత అప్పగించి సత్వరమే సమస్యలు పరిష్కరించవచ్చు.

● ఒక్కో ఉద్యోగికి 160 ఇళ్ల బాధ్యత

ప్రభుత్వం చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ బాధ్యతను సచివాయల ఉద్యోగులకు అప్పగించింది. ఒక్కో ఉద్యోగి రెండు క్లస్టర్లలో హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఒక్కో ఉద్యోగి 100 నుంచి గరిష్ఠంగా 160 ఇళ్లను జియో ట్యాగింగ్ చేయనున్నారు. గత మంగళవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవగా గుంటూరుజిల్లాలో 7,32,187 ఇళ్లకుగానూ 1,20,151 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తయింది. ఇంకా 6,12,036 ఇళ్లకు జియో ట్యాగింగ్ చేయాల్సి వుంది. పల్నాడు జిల్లాలో 7,04,609 ఇళ్లకుగానూ 2,00,478 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తవగా, 5,04,131 ఇళ్లకు ట్యాగింగ్ చేయాల్సి వుంది. బాపట్ల జిల్లాలో 5,52,503 ఇళ్లకుగానూ 2,19,895 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తవగా, 3,32,608 ఇళ్లకు ట్యాగింగు చేయాల్సి వుంది.

బ్యాంకు లింకేజీపై స్పెషల్ డ్రైవ్

నేషనల్ పెన్షన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌పీసీఎల్) కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు లింకేజీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలు ఆధార్, మొబైల్ నెంబర్లతో అనుసంధానం అయ్యాయా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తోంది. బ్యాంకుకు ఆధార్, మొబైల్ నెంబర్ అనుసంధానం కానివారి వివరాలను ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల లాగిన్లకు పంపించారు. ఇలా బ్యాంకు లింకేజీ చేయని వారి వివరాలు తెలుసుకుని, వారికి విషయాన్ని తెలియజేసి ఆధార్ లింక్ చేసుకోవాలని ప్రజలకు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుడికి అందించేలా డీబీటీ పద్ధతికి ప్రభుత్వం ప్రాధాన్యాన్ని పెంచింది.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే యాత్రీకుల రద్దీ దృష్ట్యా ఈ నెలలో నాలుగు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు. 07131 కాచీగూడ - కొట్టాయం ప్రత్యేక రైలు ఈ నెల 17, 24 తేదీలలో మధ్యాహ్నం 12.30కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల మీదగా మరుసటి రోజు సాయంత్రం 6.30 గంటలకు కొట్టాయం చేరుకొంటుంది. నెంబరు. 07132 కొట్టాయం - కాచీగూడ రైలు ఈ నెల 18, 25(సోమవారం) తేదీల్లో రాత్రి 8.50కి బయలుదేరి చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా బుధవారం వేకువజామునకు ముందు 1 గంటకు కాచీగూడ చేరుకొంటుంది. నెంబరు. 07137 హైదరాబాద్ - కొట్టాయం ప్రత్యేక రైలు ఈ నెల 15, 22, 29 తేదీల్లో (శుక్రవారం) మధ్యాహ్నం 12.05కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల మీదగా మరుసటి రోజు సాయంత్రం 6.45కి కొట్టాయం చేరుకొంటుంది. నెంబరు. 07138 కొట్టాయం - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 16, 23, 30 తేదీల్లో(శనివారం)c రాత్రి 9.45కి బయలుదేరి గుంటూరు మీదగా ఆదివారం అర్ధరాత్రి దాటాక 12.50కి సికింద్రాబాద్ చేరుకొంటుందన్నారు.

నేడు విశాఖపట్నం, రేపు గుంటూరు సింహాద్రి రైళ్ల రద్దు

విజయవాడ డివిజన్‌లో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా నెంబరు. 17239 గుంటూరు - విశాఖపట్టణం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 14వ తేదీన, నెంబరు. 17240 విశాఖపట్టణం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 15న రద్దు చేస్తున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు.

విక్రమ సింహపురి రైలుకి న్యూగుంటూరులో టిక్కెట్‌లు ఇవ్వాలి

ఈ నెలాఖరు వరకు విజయవాడ - గూడూరు విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్‌ని రైల్వే శాఖ న్యూగుంటూరు మీదగా దారి మళ్లించి నడుపుతున్నది. కాషన్ ఆర్డర్ కోసం న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌లో ఈ రైలుని రెండు నిమిషాలు నిలుపుదల చేస్తున్నారు. అయినప్పటికీ న్యూగుంటూరు నుంచి జనరల్ టిక్కెట్‌లు జారీ చేయడం లేదు. దీనిపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు హెడ్‌క్వార్టర్స్‌కు నివేదించి దారి మళ్లింపు ఉన్నన్ని రోజులు న్యూగుంటూరులో జనరల్ టిక్కెట్‌లు జారీ చేయాలని కోరుతున్నారు.



సైకిల్‌పై అరటి గెలలతో చెన్నుబోయిన పద్మ



తాను కరిగిపోతూ పలువురికి వెలుగునిచ్చే కొవ్వొత్తికి అమ్మకి దగ్గరి సారూప్యం కనిపిస్తుంది. నవమాసాలు మోసి..కనిన పిల్లలను పెంచి పెద్ద చేసేందుకు జీవితాన్నే ధారపోస్తుంది.ఆ ప్రయత్నంలో ఎంత బాధ ఉన్నా హాయిగా భరిస్తుంది. అటువంటి అమ్మ 'చిత్రమే' ఇది. సైకిల్ పై అరటి గెలలతో ఉన్న మహిళ పేరు చెన్నుబోయిన పద్మ. వయస్సు 48 సంవత్సరాలు. ఊరు గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు. భర్త, ముగ్గురు ఆడపిల్లలు కలిగిన నిరుపేద కుటుంబం. భర్త వ్యవసాయ కూలీ. వేడి నీళ్లకు చన్నీళ్ళలా భర్తకు చేదోడుగా ఉండటానికి భారమైన బతుకు మార్గాన్ని ఎంచుకుంది.

అమ్మా.. నీకు వందనం

సైకిల్‌పై అరటి గెలలు పెట్టుకొని అమ్మడానికి ప్రతి రోజూ చాలా ఊర్లు తిరుగుతుంది. వానొచ్చినా.. ఎండొచ్చినా.. రోగమొచ్చినా..బాధొచ్చినా ఆ కష్టతరమైన ప్రయాణం మాత్రం ఆగదు.ఇలా అనేక సంవత్సరాలుగా జరుగుతూనే ఉంది. ఈ రెక్కల కష్టంతోనే ఉన్న ముగ్గురు ఆడ పిల్లల్లో ఒకరికి పెళ్ళి చేసింది. మిగిలిన ఇద్దరు పిల్లలు గవర్నమెంట్ బడిలో చదువుకుంటున్నారు. వాళ్ళని పెద్ద వాళ్లను చేసి ప్రయోజకులను చేయటమే ఆమె సంకల్పం. గుండె నిండా ఊపిరి తీసుకొని ముందుకు సాగాల్సిన ఇంతటి కష్టతరమైన పనిలో ఉండి కూడా ఆమె ముఖంలో విసుగు కానీ.. నిరాశ.. నిస్పృహ కానీ మచ్చుకైనా కనిపించవు. అందుకే అంటారు.. అమ్మ అన్నది ఒక కమ్మని మాట..అది ఎన్నెన్నో తెలియని మమతల మూట అని. బిడ్డల కోసం.. వారి బాగోగుల కోసం.. నిరంతరం తాపత్రయపడే ఇటువంటి ఎందరో 'అమ్మ'లకు వేవేల వందనాలు.

-(గుంటూరు సిటీ,ఆంధ్రజ్యోతి)

మంగళగిరి చేనేత అద్భుతం

బ్రిటీష్ హైకమిషనర్ లిండే కామెరూన్

మంగళగిరి సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేతి మగ్గంపై తయారవుతున్న మంగళగిరి చేనేత వస్త్రాలు అద్భుతంగా ఉన్నాయని, అపురూపమైనవని బ్రిటీష్ హైకమిషనర్ లిండే కామెరూన్ తెలిపారు. లిండే కామెరూన్, ఆమె భర్త సీన్ రేనాల్డ్‌తో కలిసి బుధవారం మంగళగిరిలో పర్యటించారు. తొలుత మంగళాద్రి క్షేత్రాన్ని సందర్శించారు. దిగువ సన్నిధిలో శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్‌శాలను సందర్శించారు. చేనేత నేసే విధానం, మగ్గంపై తయారైన ఉత్పత్తులను పరిశీలించారు. చీర నేసేందుకు పట్టే సమయం, శ్రమ, ఆదాయ వివరాలను నేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. లిండే కామెరూన్ స్వయంగా మగ్గం నేశారు. మహిళల కుట్టు శిక్షణా కేంద్రాన్ని సందర్శించి అక్కడ తయారవుతున్న జూటు బ్యాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత కార్మికులు మగ్గంపై ఎంతో కళాత్మకంగా డిజైన్లను రూపొందిస్తున్నారన్నారు. చీర అంచుల్లో వస్తున్న డిజైన్లు తనను అమితంగా ఆకట్టుకున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, చేనేత జౌళి శాఖ ఏడీ ఉదయ్‌కుమార్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



వీవర్‌శాలలో మగ్గం నేస్తున్న బ్రిటీష్ హైకమిషనర్ లిండే కామెరూన్



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న బ్రిటీష్ హైకమిషనర్ లిండే కామెరూన్

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అక్రమ మద్యం కేసులో ఒకరి బైండోవర్

రొంపిచర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతూ ఎక్సైజ్ పోలీసులకు ఇటీవల పట్టుబడ్డాడు. కాగా సదరు వ్యక్తిని బుధవారం రొంపిచర్ల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం అమ్మినా, ఎంఆర్‌పీ కంటే అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రైమ్ జోన్

తప్పుడు సాక్ష్యంపై కేసు

నరసరావుపేట లీగల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తప్పుడు సాక్ష్యం చెప్పిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన నరసరావుపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్‌లో ఒకరి బదులు మరొకరు సాక్ష్యం చెప్పడంతో గమనించిన సిబ్బంది మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఓ ఈపీలో కాసా మల్లికార్జునరావు సాక్ష్యం ప్రవేశపెట్టి క్రాస్ ఎగ్జామినేషన్లో దీకొండ సాంబశివ అనే వ్యక్తి చెప్పడంతో గమనించిన సిబ్బంది ఏపీ సింహాచలం ద్వారా మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు మొదటి పట్టణ సీఐ ఎం.వి చరణ్ తెలిపారు. కాగా నిందితునికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

నరసరావుపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం శ్రీరామపురంలోని ఆలయంలో శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భజనా, పూజా కార్యక్రమాలు, అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఓలేటి రాజేంద్రప్రాదు, కూనిశెట్టి మురళి, పొత్తూరి వరప్రసాదరావు, తాటికొండ వెంకటేశ్వరశర్మ, పెనుగొండ హనుమంతరావు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ఐఈ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ ఏఎంవో పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

నరసరావుపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పల్నాడు సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఐఈ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ ఏఎంవో పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎల్.చంద్రకళ బుధవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లు నవంబరు 14 నుంచి 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్ష కార్యాలయం, పల్నాడులో అందజేయాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేయదలచిన వారు విడివిడిగా దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తులు, ఆదనపు సమాచారం కోసం సమగ్ర శిక్ష కార్యాలయం పల్నాడులో పనివేళలలో సంప్రదించాలన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వినుకొండ, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు వినుకొండ గ్రంథాలయ శాఖ అధికారి బూక్య బద్రినాయక్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రంథాలయ వారోత్సవాలకు సంభందించిన పోస్టర్‌ను మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, తహసీల్దార్ సురేష్‌నాయక్, ఎంపీడీవోల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ గ్రంథాలయం విజ్ఞాన బాండాగారమని ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వారోత్సవాల్లో పిల్లలకు వివిధ కార్యక్రమాలు చిత్రలేఖనం, వ్యాసరచనతోపాటు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని గ్రంథాలయ అధికారి తెలిపారు.

గృహ లబ్ధిదారులకు న్యాయం చేయాలి: తోట

వినుకొండ, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో టిడ్కో ఇళ్ళ లబ్ధిదారుల సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ఆల్‌ఇండియా కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 8 సంవత్సరాలు క్రితం టీడీపీ హయాంలో పేద, మధ్యతరగతి పట్టణ ప్రజలకు టిడ్కో ఇళ్ళ నిర్మాణం చేపట్టారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్ర భుత్వం వాటిని పూర్తిచేయకుండా, పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో జగనన్న కాలనీ పేరిట కాలనీని ఏర్పాటుచేశారు. అదికూడా అసంపూర్తిగా ఉన్నదని, టిడ్కో ఇళ్ళ నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చిలకలూరిపేట సీపీఐలో గందరగోళం

చిలకలూరిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీపీఐలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. సీపీఐ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్న నాగబైరు రామసుబ్బాయమ్మను పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఏ మారుతీ వరప్రసాద్ సస్పెండ్ చేశారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా, కక్షపూరితంగా, ఏకపక్షంగా చేసిన తన సస్పెన్షన్‌ను రామసుబ్బాయమ్మ బుధవారం ఖండించారు. నిజానిజాలు తేల్చుకునేందుకు బహిరంగ చర్చకు సిద్ధమా అని ఆమె ప్రశ్నించారు. మారుతి వరప్రసాద్ అవినీతి తిమింగలం అని, ఆయనను రాష్ట్ర పార్టీ సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన పలువురు కూడా రాజీనామా చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

అధ్వానంగా పోలీసు క్వార్టర్లు

- సద్వినియోగం చేసుకోని సిబ్బంది
- తలుపులు, కిటికీలు చోరీ
- జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్నా పట్టించుకోని అధికారులు




రొంపిచర్లలోని పోలీసు క్వార్టర్ల ఆవరణలో కట్టేసిన గేదెలు, అధ్వానంగా ఉన్న లోపలి భాగం

రొంపిచర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామంలోని జడ్పీ పాఠశాల వెనుక ఉన్న పోలీసు క్వార్టర్లు అధ్వానంగా తయారయ్యాయి. సుమారు 25 సంవత్సరాల క్రితం వీటిని నిర్మించారు. అప్పటి నుంచి స్టేషన్ సిబ్బంది ఇందులో నివశించిన దాఖలాలు లేవు. సిబ్బంది క్వార్టర్స్‌తో పాటు ఎస్‌హెచ్‌వో క్వార్టర్స్ నిర్మించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఇందులో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు స్టేషన్ వైపు ఉన్న కార్యాలయాన్ని ఇక్కడకు మార్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తహసీల్దార్ కార్యాలయాన్ని యథాస్థానానికి మార్చారు. దీంతో సమీపంలోని గ్రామ రైతులు క్వార్టర్స్ ఆవరణలోను, ఖాళీ స్థలంలోనూ గేదెలను కట్టేసుకుంటున్నారు. ఐతే ప్రస్తుతం పోలీసు స్టేషన్ క్వార్టర్లు అధ్వానస్థితికి చేరాయి. తలుపులు, కిటికీలు, పలు సామగ్రి, చోరీకి గురయ్యాయి. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న ఈ క్వార్టర్స్‌ను ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. భవనాలు లేక పలు శాఖలు ఇబ్బందులు పడుతుంటే ఉన్న భవనాలను పోలీసు శాఖ వినియోగించు కోవటం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, ప్రజాధనం వృథా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎత్తిపోతల పథకాల దుస్థితిపై అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా సహా రాష్ట్ర వ్యాప్తంగా దయనీయమైన పరిస్థితుల్లో ఉన్న ఎత్తిపోతల పథకాల దుస్థితిపై అసెంబ్లీ వేదికగా మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నోత్తరాల సమయంలో బుధవారం ప్రస్తావించారు. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రికి క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడు జిల్లా వరకే మొత్తం 150 చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో 57వరకు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయని, వాటన్నింటినీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాడుబెట్టారని, చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు పోయినా, మోటార్లు దెబ్బతిన్నా పట్టించుకోక పోవటంతో పూర్తిగా నిరుపయోగంగా మారాయని వాపోయారు. ముఖ్యంగా ఆయకట్టులో చివరి భూములు ఎత్తిపోతల పథకాలు పని చేయక అక్కడి రైతులు తీవ్ర మైన సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో అన్ని ఎత్తిపోతల పథకాలు వినియోగంలోకి వచ్చేలా నిర్వహణ మరమ్మతులకు నిధులు ఇచ్చామని, ఇప్పుడు మరోసారి అదేవిధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులందరికీ ఉపయోగపడేలా, చివరి భూములకు నీరు అందించేలా చూడాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి విన్నవించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు

వినుకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మునిసిపాల్టీలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ భవన నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అక్రమ భవనాల నిర్మాణాలు జరుగుతున్నా వినుకొండలో పట్టించుకునే నాధుడు లేరు. భవన నిర్మాణాలు పర్యవేక్షించాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడంతో కొందరు కౌన్సిలర్లు సైతం పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. వినుకొండ పట్టణంలోని కారంపూడి రోడ్డు టీవీఎస్ షోరూం సమీపంలో పట్టణానికి చెందిన ఒక వైసీపీ కౌన్సిలర్ మునిసిపాలిటీ నుంచి తీసుకున్న అనుమతులు అతిక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. జీ ప్లస్ 3 అనుమతులు తీసుకొని నాల్గో అంతస్తు నిర్మిస్తున్నారు. కనీసం సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ స్థలం లేకుండా బిల్డింగ్ నిర్మాణం చేపడుతున్నారు. అలాగే వెల్లటూరు రోడ్డులో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా హనుమాన్‌నగర్ సమీపంలో రోడ్డు పక్కన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నారు. అంతేగాకుండా కొండపక్కన అనుమతులు లేకుండా మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలోని అక్రమ నిర్మాణాలు అడ్డుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై టౌన్‌ప్లానింగ్ అధికారి వివరణ కోరగా జీ ప్లస్3కి మాత్రమే అనుమతులు ఉన్నాయని తెలిపారు.



కారంపూడి రోడ్డులో వైసీపీ కౌన్సిలర్ నిర్మిస్తున్న భవనం

రూ.6వేలకు చేరిన మూట పొగ నారు ధర

నాదెండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పొగ నారు ధర మూట రూ.6వేలకు చేరింది. మొన్నటివరకు కేవలం రూ.3వేలు ఉన్న ధర ప్రస్తుతం రెట్టింపు అయింది. చిలకలూరిపేట నియోజకవర్గంలోని గణపవరం, నాదెండ్ల, మురికిపూడి తదితర గ్రామాల్లో రైతులు పొగ నారుమళ్ళను పెంచారు. ఈ ఏడాది రైతులు అధిక విస్తీర్ణంలో పొగ సాగు చేపట్టడంతో నారుకు డిమాండ్ పెరిగింది.

గ్రామాల్లో సమన్వయంతో పనిచేయాలి

- ఇన్‌చార్జ్ ఎంపీడీవో కే ప్రభాకరరావు

బొల్లాపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రం బొల్లాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు మండల స్థాయి అధికారులు రెండు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా మొదటిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొల్లాపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవో కే ప్రభాకరరావు మాట్లాడుతూ గ్రామాల్లో సమన్వయంతో పని చేయాలని సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జీపీడీపీ, బీపీడీపీ 2025 - 2026 పంచాయతీల్లో అభివృద్ధి పనుల ప్రణాళికల్లో భాగంగా 15 అంశాల పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ అధికారులు పనులు చేయమంటారు, చేసిన వాటికి బిల్లులు ఇవ్వరని, మేము రాజీనామా చేయమంటే చేస్తామని ఎంపీడీవో కొందరు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో కే ప్రభాకరావు

శావల్యాపురం జడ్పీ పాఠశాలలో క్రీడాపోటీలు

శావల్యాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శావల్యాపురం జడ్పీ పాఠశాలల్లో 3వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ విద్యార్థుల వరకు బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో బాలికలు, బాలురకు విడివిడిగా పరుగు పందెం, వ్యాసరచన పోటీలు నిర్వహించామని, గెలుపొందిన బాలబాలికలకు గురువారం జరగనున్న బాలల దినోత్సవ వేడుకలలో బహుమతులు పంపిణీ చేస్తామన్నారు. పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

పనుల ఆమోదానికి ఉపాధి హామీ గ్రామసభలు

శావల్యాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీపథకం ద్వారా 2025-26 ఆర్థికసంవత్సరంలో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేసి వారి ఆమోదాన్ని పొందేందుకు ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. మండలంలోని వయ్యకల్లు, ముండ్రువారిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలను బుధవారం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వయ్యకల్లులో రూ.63,40,000 విలువజేసే 72పనులు, ముండ్రువారిపాలెంలో రూ.59,45,000 విలువజేసే 67 పనులు గుర్తించి ప్రజల నుంచి ఆమోదాన్ని పొందినట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూలీలసంఖ్యను పెంచి గ్రామాల్లో ఎక్కువ పనులు జరిగేలా కృషి చేయాలన్నారు. గ్రామ సర్పంచ్‌లు గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, పాపసాని విజయలక్ష్మి, ఏపీవో రామారావు, టీఏ బేబీరోజ, పంచాయతీ కార్యదర్శులు సైదారెడ్డి, వాసు పాల్గొన్నారు.



గెలుపొందిన బాలికలతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన బాలికలకు అభినందనలు

శావల్యాపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొని అత్యున్నత ప్రతిభ కనబరచి బాలికలకు అభినందన సభను స్థానిక జడ్పీ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కనమలచెర్వులో అండర్-14 బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థినులు లిఖిత, జ్యోతిక, శ్రీహర్షితలను, నంద్యాలలో జరిగిన సీనియర్ మహిళల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొని ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టును మూడోస్థానంలో నిలిపిన పాఠశాలకు చెందిన విద్యార్థినులు లూధియా, కావ్య, దివ్య, దేవమణి, సమీర, రవళి, రత్నకీర్తన, స్రవంతి, పాఠశాల పూర్వవిద్యార్థినులు ముక్కపాటి లిఖిత, బసవరాణిలను పాఠశాల పీఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, స్టాఫ్‌సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల పూర్వవిద్యార్థిని ముక్కపాటి లిఖిత జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ ఫెడరేషన్ కప్ ప్రాబబుల్స్ జట్టులో పాఠశాల విద్యార్థినులు వేముల దివ్య, ఆకుమల్ల సమీరలు ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, అబ్దుల్లా, విమల, కవిత, కిరణ్మయి, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేటి నుంచి జోనల్ ఆటల పోటీలు

నూజెండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో బాలికల జోనల్ లెవల్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ ఎన్‌వీ రమణమ్మ బుధవారం తెలిపారు. మహిళల జోన్ - 3 2024 ఆటల పోటీలు ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు.

ఆధార్ కేంద్రం లేక విద్యార్థులు, గ్రామస్థులకు ఇక్కట్లు

బొల్లాపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రమైన బొల్లాపల్లి, గుమ్మనంపాడు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేయక విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ప్రభుత్వం ఇటీవల అపార్ కార్డులు విద్యార్థులకు ప్రవేశపెట్టగా వాటిలో విద్యార్థులు ఆధార్ కార్డుల్లో ఒక్కొక్కరు ఉండటంతో ఆధార్ కేంద్రాల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఐతే బొల్లాపల్లి గ్రామంలోని సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రంలో డిజిటల్ అసిస్టెంట్ బదిలీపై రావులాపురం గ్రామం వెళ్ళటంతో నెల రోజుల నుంచి ఆధార్ కేంద్ర పరికరాలు మూలకుచేరాయి. దీంతో బొల్లాపల్లి సమీప గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మూలకు చేరిన ఆధార్ కేంద్రం పరికరాలు

దేవాలయాలను సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్

నాదెండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులోని పలు దేవాలయాలను పల్నాడు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆంజనేయులు సందర్శించారు. ఈ సందర్భంగా రెడ్డిపేరంటాలమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి, సీతారాముల స్వామి దేవస్థానం, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న ప్రతి దేవాలయం వద్ద పేరు తెలిపే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని ఇన్‌స్పెక్టర్లకు సూచించారు.

నీటి పథకంపై విచారణ

నాదెండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలోని రక్షిత తాగునీటి పథకంలో జరిగిన అవినీతిపై ఇన్‌చార్జ్ కార్యదర్శి ఠాకూర్‌రెడ్డి బుధవారం విచారణ జరిపారు. జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన భవనం శ్రీనివాసరెడ్డి, ఘంటా హరికృష్ణలను ఆయన విచారించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.20 లక్షల విద్యుత్ బిల్లులు చెల్లించకుండా గ్రామస్థుల నుంచి లక్షలాది రూపాయలు రుసుం వసూలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని కోరారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేత

యడ్లపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ఎస్ఎస్‌కే ఫౌండేషన్ సహకారంతో యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సువర్ణకుమారి పాల్గొని బాలల హక్కులు, వారికి చట్టం కల్పిస్తున్న రక్షణ గురించి వివరించారు. అనంతరం 100మంది విద్యార్థులకు ప్లేట్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేస్తున్న సువర్ణకుమారి, హెచ్‌ఎం విజయభారతి



సమస్య ఇది.. స్పందించరూ

శిథిలావస్థలో రోడ్లు ఊడ్చే యంత్రాలు

నరసరావుపేట పురపాలక సంఘం రూ.25లక్షలు వెచ్చించి రోడ్లు ఊడ్చే యంత్రాలను రెండింటిని కొనుగోలు చేసి వీటి వినియోగాన్ని విస్మరించింది. మునిసిపల్ కార్యాలయంలో యంత్రాలు రెండూ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. టైర్లు పాడైపోయాయి. అధికారుల నిర్లక్ష్యానికి యంత్రాలు నిదర్శనంగా నిలిచాయి. వీటికి మరమ్మతులు చేపడితే పారిశుధ్య పనులకు వినియోగించే అవకాశం ఉంది. - నరసరావుపేట, ఆంధ్రజ్యోతి



ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిత్యావసరాలను పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత

ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఆర్డీవో తనిఖీ

వినుకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీలో పేదలకు అందజేస్తున్న నిత్యావసరాల తూనికలు సక్రమంగా ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని ఆర్డీవో మధులత అన్నారు. పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను బుధవారం ఆర్డీవో పరిశీలించారు. గోదాములో ఉన్న రికార్డులను పరిశీలించి సరుకుల నాణ్యతను కొలతలను పరిశీలించారు. నిత్యావసర సరుకుల్లో వ్యత్యాసాలు ఉంటే వెంటనే తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మిద్దెబావి కాలనీలో అనర్హులు పట్టాలు పొందుతున్నారని స్పందనలో పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేయగా ఆర్డీవో మధులత మిద్దెబావి కాలనీని పరిశీలించి తప్పుడు పత్రాలు సృష్టించిన వారిని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ సురేష్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి హామీ పనులపై డ్వామా పీడీ సమీక్ష

యడ్లపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం 2024-25 పనులపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ద లింగమూర్తి సమీక్షించారు. బుధవారం మండలంలోని సొలస, చెంఘీజ్ ఖాన్ పేట, కొత్తపాలెం గ్రామాలలో ఆయన పర్యటించారు. సొలస గ్రామంలో నిర్మాణంలో ఉన్న క్యాటిల్ షెడ్‌ను, చెంఘీజ్‌ఖాన్‌పేటలో సెరీకల్చర్ సాగుచేస్తున్న విధానాన్ని, కొత్తపాలెంలో ఫాం పాండ్ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్ర సహాయకులతో సమీక్ష నిర్వహించారు. కూలీల వివరాలు, డిమాండ్, సగటు వేతనం, వంద రోజుల పనిదినాల కల్పన, క్యాటిల్ షెడ్ల గ్రౌండింగ్, మొక్కల పెంపకం తదితర పనుల నిర్వహణ ప్రణాళికలపై సమీక్షించారు. ఆయా పనుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, ఏపీవో, టీఏ మాధవి, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ పనులపై సమీక్షిస్తున్న డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి




ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న పట్టణ టీడీపీ నాయకులు

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు శుభాకాంక్షలు

వినుకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును పట్టణ టీడీపీ నాయకులు బుధవారం గుంటూరు నగరంలోని జీవీ ఆంజనేయులు నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఈ సందర్భంగా తెలిపారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, పత్తి పూర్ణ, పీవీ సురేష్‌బాబు, షమీమ్‌ఖాన్, సౌదాగర్‌జానిబాషా, గట్టుపల్లి శ్రీను, గోల్డ్ కరిముల్లా, రియల్ ఎస్టేట్ జాని, దస్తగిరి, సాంబ, ఆరే శ్రీరాములు ఉన్నారు. వీరు విజయవాడలో ఏపీ శాసనసమండలి మాజీ చైర్మన్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్‌యండీ ఫరూఖ్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

నేరాలను అరికట్టేందుకు పటిష్ట పోలీసింగ్

- ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు



నూజెండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నేరాలను, బెట్టింగ్‌లను నియంత్రించేందుకు పటిష్టంగా పోలీసింగ్‌ను నిర్వహిస్తున్నట్టు ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు ఆంధ్రజ్యోతికి వివరించారు.

ఫటాఫట్

ప్రశ్న: మండలంలో పోలీసింగ్ ఎలా చేస్తున్నారు?

జవాబు: మండలంలోని గ్రామాల్లో పోలీసు సిబ్బందితో డే బీట్లు, నైట్ బీట్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.

ప్రశ్న: నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏంటి?

జ: గ్రామాల్లో నేరాలు, ఘోరాలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో న్యాయబద్ధంగా ప్రజలు జీవించేలా గ్రామాల్లో పర్యటించి చట్టాలపై అవగాహన కల్పిస్తూ పోలీసింగ్ చేస్తున్నాం.

ప్రశ్న: గ్రామాల్లో అక్రమ మద్యం నియంత్రణకు చర్యలు?

జ: గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నామని, అక్రమంగా మద్యం అమ్మేవారిపై కఠినంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేస్తాం.

ప్రశ్న: ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు?

జ: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయటం, వాహనదారులు హెల్మెట్, లైసెన్స్, వెహికల్ ఇన్సూరెన్స్ కలిగి ఉండేలా వాహనాలను తనిఖీచేసి హెచ్చరిస్తున్నాం.

ప్రశ్న: చట్టాలపై అవగాహన కార్యక్రమాలు ఎలా చేస్తున్నారు?

జ: చట్టాలపై అవగాహన కల్పించేందుకు సివిల్ రైట్స్‌డే నిర్వహిస్తున్నాం.